
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
2 నవంబరు, 2025



# అవనికి ఊపిరి
# అరణ్యమే

# చారిత్రక యాక్షన్ చిత్రం 'ఫౌజీ'

రెబల్ స్టార్ ప్రభాస్ తన 46వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక ఇచ్చారు. ఆయన హీరోగా, హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ గురువారం అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేయగా, అభిమానుల నుంచి విశేష స్పందన వస్తోంది.




గత వారం ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకుని, నిర్మాణ సంస్థ ఈ ప్రకటన చేసింది. "చరిత్రలోని మరుగున పడిన అధ్యాయాల నుంచి వస్తున్న ఒక సైనికుడి సాహస గాథ ఇది. రెబల్ స్టార్ ప్రభాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ పోస్టర్‌ను పంచుకుంది. 1940ల కాలం నాటి చారిత్రక కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది.

ఇందులో ప్రభాస్ సరసన కథానాయికగా ఇమాన్వి నటిస్తున్నారు. వీరితో పాటు అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, భానుచందర్, జయప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సీతారామం' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు. సుదీప్ ఛటర్జీ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కృష్ణకాంత్ పాటలు రాస్తున్నారు. ఈ భారీ చారిత్రక చిత్రానికి శీతల్ శర్మ కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు.

తారాతీరం

# బన్నీ సినిమాలో పూజాహెగ్డే స్పెషల్ సాంగ్

అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం గురించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఓ ప్రత్యేక గీతం కోసం స్టార్ హీరోయిన్ పూజా హెగ్డేను సంప్రదించినట్లు సమాచారం. ఈ విషయం ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఇటీవల రజినీకాంత్ హీరోగా వచ్చిన 'కూలీ' సినిమాలో పూజా హెగ్డే చేసిన స్పెషల్ సాంగ్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఈ పాట విజయంతో ఆమెకు అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే క్రమంలో అల్లు అర్జున్, అట్లీలు తమ సినిమాకు పూజా హెగ్డే ఐటమ్ సాంగ్ అయితే కచ్చితంగా ప్లస్ అవుతుందని భావించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనకు ఆమె కూడా సానుకూలంగా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. సినిమా విజయంలో ఈ పాట కీలకమవుతుందని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. భారీ బడ్జెట్‌తో సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా దీన్ని రూపొందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్న ఈ ప్రాజెక్టును అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ముంబైలో ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది.



ఆదివారం వార్త

2 నవంబరు, 2025

## మంచి ముత్యాలు

– మంచివాడనిపించుకోవటానికి కొన్నాళ్లు లేదా కొన్నేళ్లు పట్టొచ్చు. చెడ్డవాడని తెలుసుకోవడానికి కొన్ని సెకండ్లు చాలు.

– ఆలోచన ఆచరణకు పురిగొల్పేదిగా ఉండాలి.

## కదంబం

'సంఘీ'భావం....5

ఆదరణ లేని సేంద్రియ వ్యవసాయం

కవర్ స్టోరీ..6

అవనికి ఊపిరి అరణ్యమే

ఈ వారం కవిత్వం...11

మౌన యానం

కథ..20

జేబు లేని చొక్కా

సాహిత్యం.. 23

విద్యా సంస్కరణలలో తెలుగు పాఠశాల

ఇంకా...

మొగ్గ

వారఫలం

వగైరా.. వగైరా..

# సమాచారం

## భూతల స్వర్గం



స్విట్జర్లాండ్, ఆస్ట్రియాల మధ్య ఉంది లిక్టన్‌స్టైన్ దేశం. దీనికి సొంత కరెన్సీ లేదు. దేశం మొత్తం వెతికినా ఒక్క విమానాశ్రయం కనిపించదు. కనీసం సొంత భాష కూడా లేదు. కానీ, ప్రపంచంలో ధనిక దేశాల్లో ఒకటి ఆ దేశం.ఆశ్చర్యంగా ఉంది కదూ. ఐరోపా వండర్ ల్యాండ్‌గా ఖ్యాతి గడించింది. అభివృద్ధి చెందేందుకు దేశ పరిమాణం, సొంత నియమాలు అవసరం లేదని నిరూపించింది. మధ్య యుగం నాటి కట్టడాలకు లిక్టన్‌స్టైన్ ప్రసిద్ధి. ఆస్ట్రియా-స్విట్జర్లాండ్ మధ్య, ఆహ్లాదకరమైన వాతావరణంలో అందర్నీ ఆకట్టుకుంటోంది. వాడుజ్ కేంద్రంగా పాలన సాగుతుంది. జనాభా దాదాపు 30 వేలు. చాలా మందికి ఈ దేశం ఉన్నట్లే తెలియదు. జర్మన్ భాషనే మాట్లాడుతారు. స్విట్జర్లాండ్ కరెన్సీ ఫ్రాంక్‌నే ఇక్కడ కూడా ఉపయోగిస్తారు. అయినప్పటికీ ఈ ప్రపంచంలో ధనికమైన, సురక్షితమైన దేశాల్లో ఒకటిగా లిక్టన్‌స్టైన్ నిలుస్తోంది. జీవితాంతం పని చేయకపోయినా సుఖంగా బతికేంత డబ్బు అందరి దగ్గరా ఉంటుంది. అందుకే తమ అభిరుచులకు అనుగుణంగా నచ్చిన వ్యాపకాలు పెట్టుకుంటూ ఇక్కడి ప్రజలు సంతోషంగా జీవిస్తుంటారు.

ప్రధానంగా పర్యాటకం, ఐటీ, తయారీ రంగాల ద్వారా ఆదాయం వస్తుంది. పన్నులు కూడా నామమాత్రమే.

చాలా మంది తమ సంపద గురించి అందరికీ చెప్పాలని ఆరాటపడుతుంటారు. కానీ, అక్కడి ప్రజలు దానిని చిన్నతనంగా భావిస్తారు. పరస్పరం గౌరవించుకుంటూ జీవనం సాగిస్తారు. అంతేకాకుండా నేరాల రేటు చాలా తక్కువ.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com











కుర్చీలే కదా..! ఇందులో పెద్ద వింతేముంది? అని తీసిపారేయకండి సుమా! ఆకులు, పండ్ల ఆకారంలో వున్న కుర్చీల్లో కూర్చుంటే అవి కందిపోతాయేమో అన్న అనుభూతి కలుగుతుంది ఎవరికైనా. పనితనానికి కాస్త సృజనాత్మకత తోడైతే వాటి అందం మరింత ఇనుమడిస్తుంది.









'సంఘీ' భావం



# ఆదరణ లేని సేంద్రియ వ్యవసాయం

పర్యావరణ పరిరక్షణ. ప్రజల ఆరోగ్యం, ఆహార పదార్థాల నాణ్యత పెంపుదల వంటి అనేక అంశాలతో ముడిపడి ఉన్న సేంద్రీయ వ్యవసాయం ఆశించినంతగా ఫలితాలను ఇవ్వడం లేదు. రసాయనాలు కలిగిన ఎరువులను వాడటం ద్వారా అధిక దిగుబడి సాధిచాలన్న రైతుల దృక్పదం సేంద్రీయ వ్యవసాయానికి ఆటంకం కలిగిస్తోంది. సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంట ఆరోగ్యానికి మంచిదని, పంటచేలకు మరింత పుష్టిని ఇస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. కానీ సేంద్రియ ఎరువుల సాగువైపు మాత్రం ఎవరూ మొగ్గు చూపడం లేదు. గతంలో పశువుల ఎరువు, గొర్రెల మందలు, చింతపొల్లు, ఒంద్రుమట్టి, చెట్ల ఆకులు, వెంపల్లి కొమ్మలను ఎరువుగా వాడుకొని పంటలు సాగుచేసేవారు. దీంతో నేలలు సారవంతంగా మారడంతో పాటు పైరు కూడా దృఢంగా పెరగి తెగుళ్లను తట్టుకునేది. అంతే కాకుండా అలాంటి ఆహారం తీసుకోవడంతో మనుషులు ఆరోగ్యంగా ఉండేవారు. పెరుగుతున్న జనాభాకు సరిపడా ధాన్యం ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం కొత్త వంగడాలు తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే రసాయన ఎరువుల వినియోగాన్ని అలవాటు చేశారు. ఒక రైతు పంటకు యూరియా చల్లితే పైరు వెంటనే గ్రీనరీగా కనిపించేది. కొత్త వంగడాలు, రసాయన ఎరువులు వాడిన రైతులకు దిగుబడి కూడా అధికం గా రావడంతో ఒకరిని చూసి మరొకరు అంతా రసాయన ఎరువులకు అలవాటు పడ్డారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పంట దిగుబడి బాగా రావాలని రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడకాన్ని ప్రారంభించారు. దీంతో నేలలు నిస్సారమవడమే కాకుండా పైరు కూడా తెగుళ్లను తట్టుకునే శక్తిని కోల్పోయింది. రసాయనాలతో కూడిన ఈ ధాన్యాన్ని తినడం తో ప్రజలు వివిధ రకాల రోగాల బారిన పడుతున్నారు. దీంతో శాస్త్రవేత్తలు అప్రమత్తమై సేంద్రియ సాగును ప్రోతహిస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువులను రైతులు వాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా రసాయన ఎరువులు అధికంగా వినియోగించడంతో సారం కోల్పోయిన నేలలు సారవంతంగా మారేందుకు పచ్చిరొట్ట ఎరువు వినియోగం కోసం సబ్సిడీలు అందిస్తున్నారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచితే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి. సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేయడంతో పది సంవత్సరాల నుంచి రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. యువరైతులు సేంద్రియ సాగువైపు మొగ్గ చూపుతున్నారు. గ్రామాల్లో పశువుల, గొర్రెల ఎరువులు తగ్గిపోవడంతో ప్రభుత్వం జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల వినియోగం పెంచేందుకు విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నది. రసాయన ఎరువులు వరి, పత్తి, మొక్కజొన్న సాగులోనే అధికంగా వినియోగిస్తున్నట్లు వ్యవసాయ అధికారుల సర్వేలు చెబుతున్నాయి. రసాయనిక ఎరువులు వాడడం వల్ల ఎకరాకు దాదాపు 25 నుంచి 28 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. దీంతో రైతులు రసాయనిక ఎరువులను వాడుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల దిగుబడి తక్కువగా వస్తోందని రైతులు మొగ్గు చూపడం లేదు. సేంద్రియ ఎరువులు పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం, కార్బన్ వంటి పోషకాలు మొక్కకు సమపాళ్లలో అందించి ఆరోగ్యకరమైన మొక్కను తయారు చేస్తుంది. అంతేకాకుండా మొక్క దృఢంగా పెరగడంతో తెగుళ్లను కూడా తట్టుకునే శక్తి ఉంటుంది. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. సేంద్రియ ఎరువులు అనేవి రైతులు స్థిరమైన పంట ఉత్పత్తిని పెంచడానికి ఉపయోగించే సహజ ఉత్పత్తులు. పొలం ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు, పంట అవశేషాలు ఇతర వ్యవసాయ వ్యర్థాల నుండి తయారు చేసిన కంపోస్ట్, వర్మీకంపోస్ట్, ఆయిల్ కేకులు, జీవ వ్యర్థాలు, జంతువుల ఎముకలు, కబేళా వ్యర్థాలు వంటి అనేక సేంద్రియ ఎరువులు ఉన్నాయి. సేంద్రీయ విధానంలో పంటలను సాగుచేసే రైతులకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రోత్సహకాలు, ఆర్థిక సహాయం. సబ్సీడీపై పంటకు అవసరమయ్యే ఉత్పత్తులను సరఫరా చేస్తే సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపే అవకాశం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

సుంకవల్లి సత్తిరాజు

# అవనికి ఊపిరి అరణ్యమే



**ఎక్కడో మిలమిల మెరిసే తారకల మధ్య కొలువు దీరిన చందురుని వెండి వెన్నెల చెట్ల ఆకులపై పడి నిశిలో సైతం అందమైన దృశ్యాన్ని ఆవిష్కరింపచేస్తుంటే, ప్రకృతి పరవశించి పులకరిస్తున్న భావన కలుగుతుంది.**

ఎడారిలో ఇసుక రేణువులు గాలి వేగానికి చలనమొచ్చి, అటూ ఇటూ కదలాడుతున్నాయి. కొండల మధ్య జలపాతాలు నక్షత్రాల వెలుగు జిలుగులతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి. సంద్రపు జలాల్లో అలలు అలసిసొలసి నిశ్చల స్థితికి చేరుకుంటున్నాయి. అడవుల్లో ఆకుపచ్చని చెట్లు రాతిరిని తనివితీరా ఆస్వాదిస్తూ, ఆనందంలో తేలియాడుతుంటే ప్రకృతి  వెన్నెల దుప్పటి కప్పుకుని పరవశించిపోతున్నది.  ఉషోదయంతో రేయి ముగిసి, తెలతెలవారింది. మొద్దు నిద్దుర వదలించుకుని జనజీవన నౌక ముందుకు సాగిపోతున్నది. పశుపక్ష్యాదుల జీవన పోరాటం పగలంతా విరామం లేకుండా, కొనసాగుతుంటే శ్రమ జీవుల స్వేదంతో తడిసిన ధరిత్రి పునీతమై ప్రకాశిస్తున్నది. శ్రమైక జీవన సౌందర్యం ప్రకృతిలో అందమైన, అద్భుతమైన దృశ్యకావ్యమై అలరిస్తున్నది. క్రిమి కీటకాదులు పచ్చని పైర్లపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఉభయ చరాలు పంటలకు హానిచేసే క్రిములను సంహరించి, తద్వారా ఆహారాన్ని సంపాదించుకుంటున్నాయి. పక్షులు ఆహార గింజలను తిని జీవిస్తున్నాయి. సూక్షజీవులు మానవ శరీరాలను ఆక్రమించి రక్త కణాల్లోకి చొచ్చుకుపోయి జీవిస్తున్నాయి. మరికొన్ని బాక్టీరియా, వైరస్‌లు మానవాళికి మహోపకారం చేస్తున్నాయి. రాబంధులు మృత కళేబరాలపై వాలి, వాతావరణాన్ని దుర్గంధం నుండి రక్షిస్తున్నాయి. క్రూరమృగాలు ఇతర జంతువులను వేటాడి మనుగడ సాగిస్తుంటే, ఆధునిక మానవుడు ఇతర జీవరాశుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తూ, సమస్త సృష్టిపై ఆధిక్యతా భావం ప్రదర్శిస్తూ స్వార్థపూరితమైన వికృత వేటను కొనసాగిస్తూ, ప్రకృతి విధ్వంస రచనా క్రమంలో తలమునకలై ఉన్నాడు. ఇందుకు తార్కాణమే అడవుల విధ్వంసం. అడవులను నరికి, వన్య ప్రాణులకు స్థానం లేకుండా చేసి, జీవ వైవిధ్యాన్ని హరించి, ప్రకృతి సమతుల్యాన్ని దెబ్బతీసి విజ్ఞానిగా పేరొందాలనుకోవడం అజ్ఞానం, మూర్ఖత్వం.

"మాయమై పోతున్నడమ్మా.. మనిషన్న వాడు.." అంటూ అందెశ్రీ కలం నుండి జాలువారిన పాట మానవత్వం లేని మనుషుల మనసుల్లోని మాలిన్యం గురించి తేటతెల్లం చేసింది. అయితే సాటి మనుషులపైనే కాదు, తన ఊపిరి నిలబడడానికి ప్రాణవాయువు నందిస్తున్న పచ్చని చెట్లపైన, అడవులపైన కూడా మనిషికి మమకారం నశించింది. మన శ్వాసకు ఆలంబనగా నిలుస్తూ ఆక్సిజన్ అందిస్తున్న  చెట్లను నరికేస్తూ, ఊపిరితిత్తుల వంటి పచ్చని అడవులను విధ్వంసం చేస్తూ, స్వీయ వినాశనానికి చితి పేర్చుకుంటున్న మానవ స్వార్థం గురించి ఎన్నో కన్నీటి కవితలు వెలువడుతున్నాయి. అరణ్యాల విధ్వంసం పై ఆలోచన చేయాలని ఎంతో మంది పర్యావరణ ప్రియులు గొంతెత్తి రోదిస్తున్నా, వారి వేదన కేవలం అరణ్య రోదనగానే మిగులిపోతున్నది. యథేచ్ఛగా అడవుల విధ్వంసం సాగిపోతున్నది. ప్రపంచ జనాభా పెరిగింది. పెరిగిన జనాభా అవసరాలకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాల కల్పన కూడా పెరగాలనుకోవడం సహజం. అయితే మానవ అవసరాలకు మించిన స్వార్థ చింతన ప్రకృతిని  నాశనం చేస్తున్నది. ప్రకృతిలో పచ్చదనానికి నిలయంలా మారిన అటవీ ప్రాంతం విధ్వంసం కాబడుతున్నది. పల్లెల నుండి పట్టణాలకు, నగరాలకు వలసలు వెల్లువెత్తుతున్నాయి. ఇదీ చాలదన్నట్టు అటవీ ప్రాంతాలను కూడా వదలడం లేదు. అడవులను నరికి మితిమీరిన మానవ అవసరాలను తీర్చుకుంటూ, అడవుల్లో కూడా జనావాసాలు నిర్మించుకుంటూ అడవి జీవుల ఆక్రందనకు కారణం కావడం పైశాచికం. "వృక్షోరక్షతి రక్షితః" అనే హితోక్తి ఆధునికత్వానికి పనికిరాని మాటగా మారింది. అడవులను నరికి, విలువైన అటవీ సంపదకు విఘాతం కలిగిస్తున్నాం. చెట్ల కలపను అవసరానికి మించిన విలాసవంతమైన భవనాలకు వినియోగిస్తున్నాం.

రకరకాల ఉపకరణాల కోసం, హుందాతనం ఉట్టి పడాలనే ఆరాటంతో అక్కరలేని అలంకారాలపై మక్కువ పెంచుకుని, చెట్లను నరికి వాటి కలపతో పలురకాల వస్తువులను తయారు చేసుకుంటూ, ఇంట అలంకరించుకుంటున్నాం. రహదారుల కోసం, రైల్వేల కోసం, నివాసాల కోసం, పరిశ్రమల కోసం, సాంకేతిక వ్యవస్థల కోసం, నీటిపారుదల ప్రాజెక్టుల కోసం అడవులను, పచ్చని పొలాలను విధ్వంసం చేయడం యథేచ్ఛగా కొనసాగుతున్నది.

ఆదిమానవులు అనాగరికంగా, నగ్నంగా అడవుల్లో సంచరించి, క్రూరమృగాలను వేటాడి పచ్చి మాంసాన్ని భుజించి, జీవించేవారని ప్రాచీన చరిత్ర చెబుతున్నది. ఈ కారణంగా అడవులంటే అనాగరికతకు చిహ్నంగా భావించడం తగదు. మానవ ప్రస్థానం మలుపులు తిరిగింది అడవుల్లోనే, మానవ ఆలోచనలకు అంకురార్పణ జరిగింది కూడా అడవుల్లోనే. నిప్పు కనిపెట్టింది కూడా అడవుల్లోనే. ఎలా జీవించాలో ఎలా జీవించకూడదో అన్న ఆలోచన కలగింది అడవుల్లోనే. మానవుడు తాను ఎదుర్కొంటున్న కష్టాలకు, అభద్రతకు, అనాగరికతకు పరిష్కారం కనుగొనడానికి అటవీ ప్రస్తానమే నాందీ వచనం పలికింది. నగ్నంగా తిరగడం మాని ఆకులతో, ఇతర చెట్ల కొమ్మలతో ఆచ్ఛాదన దిశగా నడిపించిన ప్రదేశాలు అడవులు. బాణాలు తయారు చేయడం రాళ్ళతో పనిముట్లు చేయడం, అడవి జంతువుల నుండి తమను తాము రక్షించుకోవడానికి రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంతో పాటు, అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు పయనించడానికి ప్రారంభమైన ఒక్కో అడుగు నాగరికతకు సోపానంలా మారింది. వాల్మీకి రామాయణ రచన సాగింది అడవిలోనే. రాక్షస సంహారం జరిగింది అడవుల్లోనే. రామాయణ, మహాభారతాల్లోని పలు సంఘటనలు అటవీ నేపథ్యంలోనే జరిగాయి. కాబట్టి అడవులను మానవ విజ్ఞాన వికాసానికి తొలిమెట్టుగా భావించాలి. అందమైన ఆకుపచ్చని పర్యావరణ వ్యవస్థను 'అడవి' అని స్థూలంగా నిర్వచించవచ్చు. చెట్లతోను, కొండ కోనలతోను, జలపాతాలతో, పలు రకాల పక్షి జాతుల జీవన హుయలతో, పలు జంతువుల ఆవాసానికి అనుకూలమైన వాతావరణంతో అందమైన ప్రకృతికి ఆలవాలం అడవులు. స్వచ్ఛమైన గాలి, కాలుష్య రహితమైన వాతావరణం, ఔషధాలతో అడవులు సహజసిద్ధమైన సంపదకు నిలయంగా ఉంటున్నాయి. అలాంటి అడవులను నాశనం చేసి, కాంక్రీట్ కర్మాగారాలుగా మార్చడానికి ఆధునిక మానవుడు చేస్తున్న ప్రయత్నం గర్హనీయం. అరణ్యాలను నరికి, అటవీ సంపదను దోచి, అనేక జంతు, వృక్ష జాతులను మానవ స్వార్థంతో అదృశ్యం చేసి, స్వార్థ చింతనతో జీవ వైవిధ్యానికి నిలయమైన అటవీ పర్యావరణ వ్యవస్థను ఛిద్రం చేయడం మూర్ఖత్వం. ఈ సమస్త సృష్టిలో భూమి మాత్రమే సకల జీవరాశులు నివసించడానికి అనుకూలమైన సజీవ గ్రహం. అలాంటి భూతలంపై సుమారు నాలుగు బిలియన్ల హెక్టార్ల అడవులు ఆక్రమించి ఉన్నాయి. 30 శాతం పైగా అడవులున్న భూగ్రహం జీవరాశుల మనుగడకు, జీవవైవిధ్య రక్షణకు అత్యవసరం. ప్రపంచంలోని సగం పైగా అడవులు అతి కొద్ది దేశాల్లోనే కేంద్రీకృతం కావడం, చాలా దేశాల్లో అడవులు అదృశ్యం కావడం, అడవులను నరికి వ్యవసాయం చేయడం వంటి చర్యల వలన అటవీ శాతం క్రమేపీ తరిగిపోతున్నది. రష్యా, బ్రెజిల్, కెనడా, యు.ఎస్, చైనా వంటి దేశాలు ప్రపంచంలో అత్యధిక శాతం అడవులను కలిగి ఉన్నాయి. రష్యా భూభాగంలో సగభాగం అడవులు ఆక్రమించాయి. రష్యాలో 642 బిలియన్లకు పైగా చెట్లున్నాయి. అమెరికా, కెనడా, బ్రెజిల్ వంటి దేశాలతో పాటుగా రష్యా కూడా అడవుల సంరక్షణ ద్వారా వాతావరణంలోని అననుకూల పరిస్థితులను నియంత్రించడంలోను, కర్బన ఉద్గారాలను తగ్గించడంలోను, జీవ వైవిధ్యాన్ని కాపాడడంలోను విశేష కృషి చేస్తున్నది.



## అటవీ చట్టాలు

భారతదేశంతో పాటుగా ప్రపంచంలోని పలుదేశాలు అటవీ చట్టాలను అమలు చేస్తున్నాయి. అటవీ చట్టాల ప్రధాన లక్ష్యం అడవులను పరిరక్షించడం, పర్యావరణాన్ని కాపాడడం, వన్యప్రాణులకు రక్షణగా నిలవడం. ఐక్యరాజ్య సమితి 'యునైటెడ్ నేషన్స్ ఫోరమ్ ఆన్ ఫారెస్ట్స్' ద్వారా అడవుల సంరక్షణ విషయంలో మానిటరింగ్ చేస్తున్నది. అమెరికా, యు.కె, బ్రెజిల్ వంటి దేశాలు చట్టపరిధిలో అడవుల పరిరక్షణ బాధ్యతను చేపట్టాయి.

భారతదేశంలో అటవీ చట్టాలకు కొదవలేదు. భారతీయ అటవీ చట్టం 1927 అటవీ ఉత్పత్తుల నియంత్రణ, పన్నుల వసూలు విధానానికి సంబంధించినది. అటవీ ప్రాంతాలను ఆయా పరిస్థితులకు అనుగుణంగా రిజర్వడ్ ఫారెస్ట్, ప్రొటెక్టెడ్ ఫారెస్ట్, విలేజ్ ఫారెస్ట్‌గా వర్గీకరణ చేయడానికి ఈ చట్టం దోహదపడింది.

అటవీ సంరక్షణ చట్టం1972 ప్రధాన లక్ష్యం వన్య ప్రాణుల సంరక్షణ. జంతువులు, పక్షులు, ఇతర జీవజాతులు అంతరించి పోకుండా కాపాడడం కోసం అభయారణ్యాలను ఏర్పాటు చేయడం, వేటను నిషేధించడం వంటి చర్యలకు ఈ చట్టం ఉపకరిస్తుంది. కొన్ని రకాల జంతువులను వేటాడి సంహరించడం నేరంగా ఈ చట్టం ప్రకటించింది.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 ఆదివాసీ తెగల హక్కులను గుర్తిస్తూ, వారు అటవీ భూములను సాగు చేసుకోవడానికి, నివాసాలను ఏర్పాటు చేసుకోవడానికి, అటవీ ఉత్పత్తులను వినియోగించుకోవడానికి రాజ్యాంగ పరిధిలో హక్కులను కల్పించింది. భారతదేశంలోని అటవీ చట్టాల ప్రధాన లక్ష్యం అడవులను, వన్యప్రాణులను సంరక్షించడం, పర్యావరణాన్ని పరిరక్షించడమే.

అమెజాన్ రెయిన్ ఫారెస్ట్, టైగా, కాంగో, న్యూగినియా వంటి వర్షారణ్యాలు ప్రసిద్ధి గాంచాయి. బయోడైవర్సిటీకి నిలయంగా రాణిస్తున్న అమెజాన్ అడవులు బ్రెజిల్ లో అధికంగా విస్తరించి ఉన్నాయి. దక్షిణ అమెరికా ఖండంలోని ఈ అడవులు బ్రెజిల్‌తో పాటుగా మరికొన్ని దేశాల్లో విస్తరించి ఉన్నాయి. భూ-వాతావరణాన్ని సమతుల్యం చేయడానికి, వాతావరణం వేడెక్కకుండా జీవరాశుల మనుగడ కొనసాగించడానికి అడవులు కీలక పాత్ర వహిస్తున్నాయి. కిరణజన్య సంయోగక్రియ గురించి మనందరికీ విదితమే. ఈ ప్రక్రియ ద్వారా మొక్కలు గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి జీవరాశుల మనుగడకు ప్రాణాధారమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. కార్బన్ డై ఆక్సైడ్ శోషణ క్రియలో అడవులు కీలక పాత్ర వహిస్తున్నాయి. అడవులు లేకపోతే భూవాతావరణంలో ఆక్సిజన్ తగ్గి జీవజాలం మనుగడ సాగించలేక భూగ్రహమే నిర్జీవంగా మారుతుంది. ప్రకృతిలో పచ్చదనం మిళితమై ఉంటుంది. గాలి, నీరు, కొండలు, లోయలు, అడవులు మొదలైన సహజసిద్ధంగా ఏర్పడి మన చుట్టూ ఆవరించబడిన సజీవ, నిర్జీవ పదార్థాల సమ్మేళనమే పర్యావరణం. అడవులు పచ్చదనానికి, ప్రాణవాయువుకు ఆలంబన. అడవులు సమృద్ధిగా ఉంటేనే పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతుంది. జీవకోటి మనుగడ సుసాధ్యమవుతుంది. మన ఊపిరికి ప్రాణవాయువు ఎంత అవసరమో, ప్రకృతి పరిరక్షణకు, పర్యావరణ భద్రతకు అడవులు కూడా అంతే అవసరం. మానవ శరీరానికి కావలసిన ఆక్సిజన్ అందించడంలోను, ఉచ్ఛ్వాస, నిశ్వాస ప్రక్రియలో ఊపిరి తిత్తులు కీలక భూమిక వహిస్తాయి. శ్వాస క్రియలో ఊపిరితిత్తులు ఎలాంటివో, భూవాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని, ఆక్సిజన్‌ను మన ఊపిరి నిలబెట్టడానికి బహుమతిగా అందించే అడవులు కూడా అలాంటివే. అందువలనే అడవులను 'గ్రీన్ లంగ్స్' అని పిలుస్తారు.



## అడవులు వర్గీకరణ

అడవుల్లో ప్రధానంగా మూడు రకాలున్నాయి. అవి ట్రాపికల్, టెంపరేట్, టైగా అడవులు. భూమధ్య రేఖకు సమీపంలో విస్తరించిన అడవులను ఉష్ణమండల అడవులుగాను. పరిమితమైన ఉష్ణోగ్రతలతో మధ్య అక్షాంక్షాల నడుమ గల అడవులను సమశీతోష్ణ అడవులు గాను విభజించారు. ఉష్ణమండల అడవులను ఆకురాల్చే అడవులుగాను, వర్షారణ్యాలుగాను ఉప వర్గీకరణ చేయవచ్చు. అధిక ఉష్ణోగ్రతలు కలిగి, తక్కువ సారవంతమైన అటవీ ప్రాంతాలు ఉష్ణమండల అడవులు .టైగా అడవులు ఎక్కువగా కెనడా, అమెరికా, రష్యా ప్రాంతాల్లో కనుగొనవచ్చు. ప్రపంచంలోని ఎక్కువ అటవీ విస్తీర్ణం టైగా అడవులదే.

ఉత్తర ధృవం చుట్టూ కేంద్రీకరించబడిన విస్తారమైన అడవులను 'టైగా' అడవులు అంటారు. సమశీతోష్ణ అడవుల్లో ఆకురాల్చే అడవులు, శంఖాకార అడవులు, మిశ్రమమైన అడవులు ఉన్నాయి. ఇవి ఎక్కువగా అమెరికా, చైనా, కెనడా, దక్షిణ కొరియా, జపాన్, ఫిన్లాండ్, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో ఉంటాయి. అమెరికాలో టోంగాస్ అడవి ఆరున్నర మిలియన్ల హెక్టార్లకు పైగా విస్తరించిన అతి పెద్ద అడవిగా పేరొందింది. దక్షిణ అమెరికాలో దాదాపు సగ భాగం విస్తరించిన ప్రపంచంలోని అతిపెద్ద అటవీ ప్రాంతం అమెజాన్. ఇది ఉష్ణమండల వర్షారణ్యం. భారత భూభాగం కంటే రెట్టింపు భూభాగంలో అమెజాన్ అడవులున్నాయి. ప్రపంచంలో 30 శాతం పైగా భూభాగాన్ని ఆక్రమించి, దాదాపు నాలుగు బిలియన్ల హెక్టార్లలో అరణ్యాలున్నాయి.

## భారతదేశ అటవీ ప్రాంతాలు

సుందర్బన్స్ అటవీ ప్రాంతం పశ్చిమ బెంగాల్‌లోని వేలాది ఎకరాల్లో విస్తరించబడిన అతి పెద్ద భారతదేశపు అటవీ ప్రాంతంగా యునెస్కో ప్రకటించింది. ఇది భారత వారసత్వ సంపదలో ఒకటిగా గుర్తింపు పొందింది. గిర్ అడవి, జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్, కాశీ హిల్స్, నందపా నేషనల్ పార్కులు భారతదేశంలో పేరొందిన అరణ్య ప్రాంతాలు. భారతదేశంలో అటవీ ప్రాంతం సుమారు 7 లక్షల 14 వేల చదరపు కిలోమీటర్లు. ఇది దేశ భూభాగంలో సుమారు 22 శాతం. భారతదేశంలో మధ్యప్రదేశ్, ఒడిస్సా, అరుణాచల ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు గణనీయమైన అటవీ విస్తీర్ణత కలిగి ఉన్నాయి. భారతదేశ భూభాగంలో 33 శాతం పైగా అడవులు ఉండాలనే నిపుణుల వాదన పర్యావరణ హితానికి చేసిన సూచన. ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు గోదావరి, విశాఖ, కడప జిల్లాల్లో అధిక అటవీ ప్రాంతం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 30 వేల చదరపు కిలోమీటర్ల మేర అడవులు న్నాయి. ఇవి రాష్ట్ర భూభాగంలో రమారమి 19 శాతం.

చత్తీస్‌గడ్, ఉత్తర ప్రదేశ్, ఒడిస్సా, రాజస్థాన్ రాష్ట్రాలు చెట్ల పెరుగుదలలో మొదటి నాలుగు స్థానాల్లో ఉండగా, మిజోరం, గుజరాత్, ఒడిస్సాలు అటవీ విస్తీర్ణతలో పెరుగుదల సాధించినట్టు ఐ.ఎస్.ఎఫ్.ఆర్ గణాంకాలు సూచిస్తున్నాయి. తెలంగాణాలో సుమారు 27 వేల చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం ఉంది. ఇది రాష్ట్ర మొత్తం భూభాగంలో 24 శాతంగా ఉంది. భద్రాద్రి, నిర్మల్, అదిలాబాద్, కొత్తగూడెం తదితర జిల్లాల్లో విస్తారమైన పరిధిలో అటవీ ప్రాంతం ఉంది. ములుగు జిల్లా సుమారు 71 శాతం అడవులతో రాష్ట్రంలో అత్యధిక అటవీ ప్రాంతం గల జిల్లాగా పేరొందింది. భద్రాద్రి, కొత్తగూడెం తదితర జిల్లాలు అటవీ విస్తీర్ణంలో తర్వాతి స్థానాలను ఆక్రమించాయి

## అడవులు-ప్రయోజనాలు

ఆక్సిజన్ ఉత్పత్తిలోను, కార్బన్ డై ఆక్సైడ్ శోషణలోను, గాలిని స్వచ్ఛంగా మార్చడంలోను అడవులు విశేష భూమిక పోషిస్తూ, జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్నాయి. అడవులు జనజీవన అస్థిత్వానికి ఆయువుపట్టు. ప్రాణవాయువునిచ్చి జగతి ఊపిరిని నిలబట్టే ఆత్మీయబంధువులు అడవులు. వాతావరణాన్ని సమతుల్యం చేసి, విషవాయువులను హరించి, స్వచ్ఛమైన ఆమ్లజని ఉద్భవించడానికి అరణ్యాలు త్యంతావశ్యకాలు. ప్రపంచంలో సంభవిస్తున్న వాతావరణ మార్పులు అనేక విపరీత్యాలకు దారితీస్తున్నాయి. వాతావరణంలో క్లోరో ఫ్లోరో కార్బన్లు, కార్బన్ డై ఆక్సైడ్, హైడ్రో ఫ్లోరో కార్బన్లు, మిథేన్ వంటి గ్రీన్ హౌస్ వాయువుల శాతం పెరగడం వలన భూమిపై ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రకృతిపై మానవులు సాగిస్తున్న విధ్వంసకాండ, అడవుల నిర్మూలన, శిలాజ ఇంధనాల వాడకం, పారిశ్రామిక వ్యర్థాలు, మానవ చర్యల ఫలితంగా గ్రీన్ హౌస్ వాయువుల శాతం స్థాయికి మించి పెరిగిపోతున్నది.



దీనినే 'గ్లోబల్ వార్మింగ్' అంటారు. ప్రపంచంలోని పలు దేశాల్లో 'గ్లోబల్ వార్మింగ్' తీవ్రత పెరిగింది. కాంగో, సోమాలియా, మెడగాస్కర్, బంగ్లాదేశ్ ఆఫ్ఘనిస్తాన్, చాద్ వంటి దేశాలు గ్లోబల్ వార్మింగ్ సమస్యను ఎదుర్కొంటున్న కొన్ని దేశాలు. ఉష్ణోగ్రతలు పెరగడం వలన సముద్ర మట్టాలు పెరగడం, వాతావరణంలో అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకోవడం వలన ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అడవులు జీవరాశులకు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చుతున్నాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నాయి. కర్బన ఉద్గారాలను తగ్గిస్తున్నాయి.


భూ ఉష్ణోగ్రతలను గరిష్ఠ స్థాయికి పెరగకుండా అదుపులో ఉంచుతున్నాయి. గరళాన్ని మింగి అమృతాన్ని ప్రసాదించిన చందంగా బొగ్గుపులుసు వాయువును స్వీకరించి జీవకోటి ఊపిరికి అవసరమైన ఆక్సిజన్‌ను అందించి అడవులు మహోపకారం చేస్తున్నాయి. ప్రకృతి అందాలకు నిలయాలు, పచ్చదనానికి ఆభరణాలు అడవులు. అడవులు ఎన్నో జంతువులకు, పక్షులకు, ఇతర జీవజాలానికి ఆమోద యోగ్యమైన నివాస ప్రాంతాలు.

## ప్రకృతిలో వికృతం మానవ స్వార్థం

నింగికి నిచ్చెన వేయాలని పరితపించే క్రమంలో మనిషి దృష్టి ఆకాశమంత ఎత్తుకు పాకింది. ఆకాశాన్నంటే ఆశలతో ఊహల ఉయ్యాలలో ఊరేగాలనే ఉబలాటం మనిషి తన మూలాలను మరచేలా చేసింది. నింగి నంటాలని చేసే ఆరాటం నేలను విస్మరించింది. నేల విడిచి సాము చెయ్యడం అత్యంత ప్రమాదకరం. చంద్రుడిపై ఆడుగు పెట్టి, శుక్రుడిని చేరుకుని, అంగారకుడిని సమీపించి, ఆదిత్యుని ఆద్యంతాలను కనుగొనాలని ఉవ్విళ్ళూరడం మానవ జిజ్ఞాసకు, అపారమైన మేధస్సుకు నిదర్శనం. ఇతర గ్రహాల్లో వాయు సంచారముందా? ఏయే వాయువులున్నాయి? ఎన్ని లక్షల సంవత్సరాల క్రితం ఇతర గ్రహాల్లో నీరుంది? అక్కడ ఏయే జీవరాశుల మనుగడ కొనసాగింది? నీటి ఆనవాళ్ళున్నాయా? భవిష్యత్తులో చంద్రుడిపై నివాసముండవచ్చా? ఇలాంటి శోధనతో శాస్త్ర వేత్తలు అహరహం కృషి చేస్తున్నారు. అయితే ఈ సకల చరాచర సృష్టిలో ఇప్పటి వరకు జీవరాశుల మనుగడకు ఆధారమైన గ్రహం భూమి మాత్రమే అన్నది నిర్వివాదాంశం. మిగిలిన పరిశోధలు ప్రస్తుతానికి కేవలం ఊహలు, ఆలోచనల వరకు మాత్రమే పరిమితం. భూమండలంపై పెత్తనం చెలాయించి, స్వార్థంతో విర్రవీగి, అడవుల నిర్మూలన జరిపి, ప్రాణాధారమైన ప్రాణవాయువు లేకుండా చేసి, భూమిపై జీవరాశుల ఉనికి లేకుండా చేస్తున్న మానవ ఉన్మాద చర్యలు వినాశనానికి హేతువులు. ఈ సృష్టిలో మనుషులతో పాటు ఎన్నో క్రూర జంతువులు మనుగడ సాగిస్తున్నాయి. మనిషి తనకున్న మేధస్సును వినియోగించుకుని భద్రమైన నివాస స్థానాలను నెలకొల్పుకున్నాడు. భయంకరమైన జంతువుల నుండి రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకుని భద్రంగా జీవిస్తున్నాడు.

పులులు, సింహాలు, ఏనుగులు, జింకలు, తోడేళ్ళు, ఖడ్గమృగాలు వంటి జంతువులకు అడవులు అభయాన్నిస్తూ, బతుకుదెరువునందిస్తున్నాయి. జంతువులను వేటాడడం, చంపి తినడం వంటి చర్యలను నిషేధిస్తూ, జంతువుల సహజ ఆవాసాలను రక్షిస్తూ ప్రభుత్వాలు చట్టాలు ఏర్పాటు చేసాయి. అయితే ఎన్ని చట్టాలున్నా, చట్టాలను ధిక్కరిస్తూ అభయారణ్యాలను మానవుడు తన స్వార్థానికి వినియోగించుకుంటున్న నేపథ్యంలో వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోతున్నది. ఆకాశాన్నంటే మానవ స్వార్థానికి సువిశాలమైన భూభాగం సరిపోవడం లేదు. అడవులను నరికి, అటవీ ప్రాంతాలను జనావాసాలుగా రూపాంతరీకరించడం వలన క్రమేపీ అడవులు కుంచించుకు పోతున్నాయి.

తమ మనుగడకు ఆధారమైన వాతావరణం లేకపోవడంతో ఎన్నో జీవరాశులు అంతరించి పోతున్నాయి. మరికొన్ని జీవ జాతులు అంతర్ధానానికి దగ్గర దశలో ఉన్నాయి. మానవ దుష్కృత్యాల వలన అరణ్యాల్లో జీవించే జంతువులు జనారణ్యాల్లో ప్రవేశిస్తున్నాయి. ఇటీవలి కాలంలో జాతీయ రహదారుపైన, జనావాసాల్లోను, పుణ్య క్షేత్రాల్లోను పులులు సంచరిస్తున్న సంఘటనలు చూస్తున్నాం. అరణ్యాలను అంతం చేస్తే క్రూరమృగాలు జనావాసాలపై పడి మానవజాతిని నంజుకుతినక తప్పదనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. భువన, గగనాలపై ఆధిపత్యం చెలాయిస్తున్న మానవుడు కొద్దిపాటి నేలను కూడా పశుపక్ష్యాదులకు కేటాయించడం లేదు. కొద్దిపాటి విస్తీర్ణంలో గల అడవులను కూడా వదలడం లేదు. గ్రామాల్లోను, నగరాల్లోను ప్రతీచోట పచ్చదనానికి చోటు లేకుండా భవంతులను నిర్మించేస్తున్నాం. మానవ నివాస ప్రాంతాలన్నీ కాంక్రీట్ అరణ్యాలుగా పరివర్తన చెందుతున్నాయి. ఇదే సందర్భంలో అరణ్యాలు కూడా కృశించుకుపోతున్నాయి. ప్రకృతిలో వికృత కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. పచ్చదనం మాయమై పర్యావరణానికి హాని జరుగుతున్నది. వాతావరణంలో సంభవించే అనూహ్యమైన మార్పుల కారణంగా అనేక





వైపరీత్యాలు సంభవించి భయానకమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఎందుకీ దురవస్థ? ఎందుకీ వినాశనం? మానవ విజ్ఞానం నేర్పిన పాఠమిదేనా? ప్రపంచంలో భిన్నమైన భౌగోళిక, వాతావరణ పరిస్థితులున్నాయి. కొన్ని చోట్ల అధిక ఉష్ణోగ్రతలుంటే, కొన్ని చోట్ల మంచుతో కప్పబడిన మైనస్ డిగ్రీ ప్రాంతాలున్నాయి. కొన్నిచోట్ల ఎడారులు, కొన్ని చోట్ల సముద్ర తీర ప్రాంతాలు, మరికొన్ని చోట్ల అడవులు కొలువై ఉన్నాయి. ఇవన్నీ మానవ నిర్మితాలు కావు. ప్రకృతిలో సహజసిద్ధంగా ఏర్పడిన ఒక అందమైన ఏర్పాటు.

ప్రకృతి సమతుల్యత వలన జీవ వైవిధ్యం పరిఢవిల్లుతుంది. జీవజాలం పదికాలాల పాటు మనగలుగుతుంది. కాని మానవ విధ్వంస కార్యకలాపాల వలన ఏర్పడే విపత్కర పరిణామాల వలన సమస్త భూగోళం గందరగోళం లోకి నెట్టబడింది. భూగ్రహం తన మనుగడను కోల్పోయి, నిర్జీవమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఏఏ జీవరాశులు ఎక్కడెక్కడ జీవించాలో, వాటి నివాసాలు ఎక్కడుండాలో ప్రకృతి నిర్దేశించింది. మానవ విజ్ఞానం వికసించక ముందే ప్రకృతి మనకు ఎన్నో పాఠాలు నేర్పింది. ఈ పాఠాలను గుణపాఠాలుగా స్వీకరించకుండా, నేల విడిచి సాము చేయడం అత్యంత ప్రమాదకరమని ప్రకృతి అనేక సంకేతాలు పంపిస్తున్నా, పట్టించుకోకుండా చేజేతులా ముప్పును కొనితెచ్చుకుంటున్న ఆధునిక మానవ జాతి ప్రమాదపుటంచున నిలబడి సుఖనిద్రకు ఉపక్రమించడం దురదృష్టకరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా మంచు ప్రాంతాలు మాయంకాక తప్పదు. శీతల దేశాలు అధిక ఉష్ణోగ్రతల బారిన పడి ఉష్ణ ప్రాంతాలుగా పరివర్తన చెందే రోజులొచ్చాయి.

సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల పెరుగుదల వలన వాతావరణంలో అవాంఛనీయ మార్పులు సంభవిస్తున్నాయి. ఇలాంటి వైపరీత్యాలను నివారించాలంటే అడవులను పరిరక్షించాలి. అడవులను పెంచాలి. వాతావరణ సమతుల్యతను కాపాడాలి. జీవవైవిధ్య సంరక్షణకు నడుం బిగించాలి. అడవుల సంరక్షణ జన జీవితంలో ఒక భాగం కావాలి. ✦

# మౌన యానం

పక్క పక్కనే ఇద్దరూ
వుండుండీ ఒక్క మాట
లాక్కెళుతోంది యేళ్లకేళ్ల
తెరల తెరల మౌనం
నది వొడ్డు, నావ



ఇద్దరూ పక్క పక్కనే
లోకాన్ని దర్శించిన
చిర్నవ్వతను.
వూసులు వినాలని
ఇతను
నవ్వుకున్నారు..
పలకరించుకున్నారు
యేళ్లకేళ్ల వూసులు
పక్షులెపోయిన
గుహలో
ఇద్దరూ పక్క పక్కనే
యేళ్ల కబుర్లతో ఇతను
యేళ్ల మౌనంలో అతను
వాళ్ళిద్దరూ!

– టి. లలితప్రసాద్

# మనసు పరిమళించెనే

మనసు పరిమళించెనే
గూటిలో గువ్వలా ముడుచుకొని
ఉండలేను.
ఆకాశాన్ని కబళించేలా రెక్కలు సాచి
డేగలా గగన విహారం చేయాలని
ఉంది.
బావిలో కప్పలా నాలోని
ప్రపంచానికి ఎల్లలు కట్టలేను.
అంతులేని సంద్రాల అంచులు
తాకాలని ఉంది.
అప్పుడే విరిసిన మందారంలా
కొత్తదనాన్ని
ప్రభవించే ప్రతి ప్రభాతంలోని
సరికొత్తదనాలను
సంతరించుకోవాలని ఉంది.
మనిషికి అస్తిత్వం ఎలాగో
మనసుకు వ్యక్తిత్వం అలానే కదా!
మనసు వికసిస్తే మాట
పరిమళిస్తుంది.
ఇప్పుడు ఎదిగిన నా మనసులో
ఒదిగిన ఆకాశాన్ని చూస్తున్నాను.
పరిమళం అద్దడానికి
ఒదిగిన నా ఒడిలో భూగోళానికి
కాస్తంత చోటు ఇవ్వాలని ఉంది.

– కే.రవీంద్రబాబు

# మౌనపు మనసు

మనసుని మౌన రాగం కమ్ముకుంది
పదాలు పలుకలేక
పెదాలు మౌనం వహిస్తున్నాయ్
గమ్యం చేరాల్సిన అడుగులు
గమనంలో
తడబడ్డాయ్.
లక్ష్యంపై
ఎక్కుపెట్టిన
బాణం
గురి తప్పి గుండెలో గుచ్చుకుంది.
బయటకు కనబడని బాధతో
లోపల పెద్ద యుద్ధమే జరుగుతోంది.
గుండె లయ చేసే శబ్దం
రెట్టింపు వేగమైంది
కనపడని ఏదో శక్తి
కిందకి కుంగదీసింది.
కలలన్నీ కన్నీళ్లలా
కళ్లముందే
కరిగిపోతుంటే
కనికరం లేని
సమాజం ముందు
కంఠం
మూగబోయింది.
అన్నిటికీ మౌనమే సమాధానంగా
కాలం ముందుకెళుతోంది.

– కోనేటి నరేశ్

ఈ వారం కవిత్వం

# ఆశయం

తెలుసునా మిత్రమా
నీవెందుకు ఒంటరైనావో
నడకకు జతలేక
పయనానికి దిక్కులేక!
కలల గమ్యం వేటలో
ఆశల రహదారిలో
సొగసైన సవారీతో
పరిగెత్తించిన కోర్కెల గుర్రాలు
హఠాత్తుగా అపరిచితులైనట్టు
బతుకుబండిని వదిలేసి
తమ దారి తాము చూసుకొని
ఒక్కటొక్కటిగా అదృశ్యమై
ఏ దూరాలకు పారిపోయాయో
ఎందుకో ఆలోచించావా ఇప్పటికైనా?
ఉచ్ఛ్వాస నిశ్వాసములకే ఉనికై
ఊపిరికే ఊపిరై ప్రాణంలో ప్రాణమై
యదపొదరింట్లో కొలువై
అతిప్రీతిపాత్రమైన ఆశయం
ఉసురుదీసి జీవచ్ఛవాన్నిజేసి
ఎడంగా ఎందుకు వెళ్లిపోయిందో
ఎందుకో ఆలోచించావా ఇప్పటికైనా?
జీవితసాఫల్యతీరం దిశకు
భద్రంగా పయనించు జీవననావ
నడిసంద్రపు సంద్యలో
తొట్రుపాటుతో ముందుకు సాగనంటూ
గమనమెటో తెల్చుకొమ్మంటూ
బతుకునెందుకు
డోలాయమాన స్థితికి లంగరేసిందో
ఎందుకో ఆలోచించావా ఇప్పటికైనా?
మది ఆలోచనా తరంగాల్లో
అమాస నిశా నిరాశల ఒత్తిళ్ళని
ప్రయత్న పోరాట పున్నమి వెలుగుల్తో
అలుపెరగక అధైర్యపడక తరిమేస్తే
కోరుకున్న ఆకాంక్షల గమ్యంవైపుకు
నడకకు దశ దిశ తోడు దక్కేనని
ఇప్పటికైనా ఆలోచించావా??

– రవి కిషోర్ పెంట్రాల



## సింగిల్ పేజీ కథ

# చీపురుకట్ట

**కూతురి** కొత్త కాపురం ఎలా ఉందో చూసి వద్దామని, బెంగళూరు బస్సు ఎక్కింది సుమంగళ. ఆమె ఎంతో ఆనందంగా ఉంది.

ఎందుకంటే కూతురు కోకిల, అల్లుడు ఆనందం ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావడం, లక్షలకు లక్షలు సంపాదించడం వల్ల.

అల్లుడు బస్ స్టాప్‌కి వచ్చి రిసీవ్ చేసుకుని కారులో తమ ఇండిపెండెంట్ హౌస్‌కి తీసుకెళ్ళాడు. చిలుకా గోరింకల్లా ఉన్న ఆ ఇద్దరినీ చూసి మురిసిపోయింది. తన దిష్టే తగిలి చిక్కిపోతారని భయపడి చూపు మార్చింది.

కూతురు ఇచ్చిన ఫిల్టర్ కాఫీ తాగుతూ ఇల్లంతా కలియజూసింది. వస్తువులన్నీ ఎక్కడివక్కడ చక్కగా సర్ది ఉన్నాయి. అన్నిటికన్నా మించి ఆమెని అమితంగా ఆకర్షించింది లేత పసుపు రంగు చీపురు కట్ట. వాస్తు ప్రకారం అది ఈశాన్యంలో పెట్టబడి ఉంది. చీపురు కొనలు నేలకి తగులుతూ ఉన్నాయి. అందులోనూ అది బోద గడ్డి ఈనెలతో చేసినవి.

“మన సంస్కృతి సంప్రదాయాలను ఈనాటి యువత పట్టించుకోవడం లేదు అని ఆరోపించేవారిని తీసుకొచ్చి కోకిల ముందు నిలబెట్టాలి..” అని మనసులో అనుకుంది సుమంగళ.


రాత్రంతా ఊరి విషయాలు, బంధువుల బాగోతాలూ అమ్మా, కూతురు తనివితీరా మాట్లాడుకున్నారు. మాట్లాడి మాట్లాడి అలసి నిద్రపోయారు.

హాల్లో పడుకుని ఉన్న సుమంగళకు ఏదో అలికిడి అయితే కప్పుకున్న దుప్పటి తీసి చూసింది. అప్పుడు సమయం ఆరు గంటలయ్యింది. అల్లుడు ఇంటి తలుపు తీసి బయటికి తొంగి చూస్తున్నాడు.

“పాల ప్యాకెట్టు కోసం చూస్తున్నాడేమో... అత్తకి ఘుమఘుమలాడే కాఫీ తన భార్య చేత చేయించాలనుకున్నాడేమో” అని మురిసిపోయింది.

మళ్ళీ ఆరుంబావుకి వాళ్ళ బెడ్ రూమ్ నుంచి వచ్చి మళ్ళీ బయటికి తొంగి చూశాడు.

“కాఫీకేముంది తొందర నిదానంగా తాగొచ్చులే” అని చెబుదామని లేచింది. “ఏమిటి బాబూ దేనికోసమో ఎదురు చూస్తున్నట్లు ఉన్నావు?” అని ఆప్యాయంగా అడిగింది.



“ఏమీ లేదు అత్తయ్యా... పనిమనిషి ఆరు గంటలకంతా వచ్చేది. ఇంకా రాలేదేమిటా... అని చూస్తున్నాను” అన్నాడు.

“అవునా...” అని నిరాశగా చెప్పి మళ్ళీ దుప్పటి కప్పుకుని పడుకుంది.

ఏడు గంటలదాకా బెడ్ రూమ్ నుంచి వస్తున్నాడు, తలుపు తీస్తున్నాడు, వెళ్తున్నాడు. అల్లుడి మీద జాలి వేసింది అత్తకి. “ తెల్లారేసరికి ఇంటి ముందర ఊడ్చి ముగ్గు పెడితేనే అల్లుడికి నచ్చుతుందేమో... నా అల్లుడు బంగారం” అనుకుంటూ కూతురు ఉన్న బెడ్ రూమ్‌కి వెళ్ళింది. చిన్నగా కూతురిని తట్టి “పనిమనిషి రాలేదు. ఇంటి ముందర ఊడ్చి ముగ్గు పెట్టాలి కదా, లెయ్యవే...” అని లేపింది.

సగం దుప్పటి తీసింది కోకిల. పక్కనే ఉన్న సెల్‌ని చేతిలోకి తీసుకుంది. టైం చూసింది. మళ్ళీ పడుకుంది. “ఏడు దాటింది. లేచి కుప్ప తోసి ముగ్గు వెయ్యవే!” అని మళ్ళీ అడిగింది సుమంగళ.

గట్టిగా దుప్పటి కప్పుకుంటూ కూతురు కోకిల “ఈరోజు మంగళవారం అమ్మా. ఆయనది డ్యూటీ. పనిమనిషి వచ్చినా రాకపోయినా అన్నీ ఆయన చేయాల్సిందే. నా డ్యూటీ రోజు నేను చేస్తున్నాను కదా!” అని మళ్ళీ దుప్పటి కప్పుకుంది.

“అయ్యో... ఇదేమి చోద్యమే... మన ఇంట్లో మీ నాయనను చీపురు కట్ట దగ్గరికి కూడా రానివ్వను. అట్లాంటిది బంగారం లాంటి అల్లుడిని కుప్ప తోసి, ముగ్గు పెట్టమంటున్నావా?” అని ముక్కు చీదింది.

“అది వెర్రికాలం. ఇప్పుడు రోజులు మారాయమ్మా.. నేను కూడా ఆయనలాగే పని చేస్తున్నాను కదా. ఆయన చదివినంత చదువు నేనూ చదివాను. అంతే జీతం తీస్తున్నాను. మన ఇంటి పనులు మనం చేసుకోవడానికి మనకెందుకు మొహమాటం. చెయ్యనీ ఆయన్ని. పోనీలే పాపం అని ఒక్కరోజు చేశాననుకో, ప్రతిరోజూ ఆ డ్యూటీ నాకే వేస్తాడు” అని చెప్పి సర్రున నిద్రలోకి జారుకుంది.

“అయ్యో అల్లుడా..!” అనుకుంటూ చీపురు కట్ట చేతిలోకి తీసుకుంది సుమంగళ.

ఏదో అర్జెంటు పని ఉన్నవాడి లాగా బండి స్టార్ట్ చేసి బయటికి వెళ్తున్నాడు ఆనందం.

సుమంగళ చేతిలోని చీపురుకట్ట డ్యాన్సు చేస్తున్నట్లుగా ఎగిరెగిరి ఊడుస్తోంది.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు



## అమూల్యమైన దిగ్దర్శనం

డా॥ తూమాటి సంజీవరావు 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం' మహాగ్రంథంలో ముఖచిత్ర మహనీయులలో సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణ దేవరాయల సరసన, స్మృత్యంకితం సమర్పించబడిన ఆచార్య తూమాటి దొణప్ప, ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి, ఆచార్య సి.నారాయణరెడ్డి, ముఖచిత్రంపైన, మరో 12 మంది విశిష్ట ప్రముఖులను దర్శింపచేశారు. గ్రంథావిష్కరణ, చిత్ర మాలికతో సహా 370 పేజీల ఈ ఉద్గ్రంథంలో ఆంధ్ర, ద్రావిడ, నాగార్జున, ఉస్మానియా, శ్రీ వేంకటేశ్వర, బెంగళూరు, శ్రీకృష్ణ దేవరాయలు, తెలుగు విశ్వవిద్యాలయాల పరిశోధనాత్మక ప్రతిభావంతులైన ఆచార్య మహోన్నతుల తెలుగు సాహితీ జగత్తును, స్థాలీపులాక న్యాయంగా దిగ్దర్శనం చేశారు. భవిష్యతరాలకు తెలుగుకీర్తిని, ప్రపంచ స్థాయిలో రెండవ అత్యుత్తమ శాస్త్రీయ భాషగా తెలుగు ప్రతిష్ట ఈ గ్రంథం ప్రశంసనీయంగా ఆవిష్కరించింది. ప్రస్తుత స్థితిగతులను కూడా తెలియచేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలలోను తెలుగును పరిరక్షించి, పాఠశాలల్లో తెలుగు మాధ్యమ బోధనను తప్పనిసరి చేయడం భాషా నైపుణ్యాలను పెంచుతుందని, పాలనా రంగంలో తెలుగును కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అమ్మనుడిని, నానుడిని రక్షించుకోలేని జాతికి మనుగడ లేదని తెలుగు భాష అస్తిత్వం సవాళ్ల వర్తమాన స్థితిగతులలో కుదించుకుపోతున్నాయని హెచ్చరించారు. ఈ గ్రంథంలోని 27 వ్యాసాలలో లబ్ధ ప్రతిష్టులైన రచయితలు తెలుగు భాషా ప్రస్థానం, సాహిత్య ప్రశస్తి, ప్రాచీనతా సాధన, ప్రాక్చారిత్రక నేపథ్యం, వ్యాకరణ, అలంకార, ఛందః ప్రాముఖ్యం, ఉన్నత విద్యలో పాఠ్యప్రణాళికలు, వాడకంలో విశిష్టత సమగ్రంగా ఎన్నో అంశాలను విశ్లేషణలతో విపులీకరించారు. డా॥ తూమాటి సంజీవరావు, తెలుగు తల్లిఘోష! పేరిట ప్రశ్నోత్తరాల మాధ్యమ ప్రహసనం, అగమ్యగోచరమైన మన మాతృభాష స్థితిగతులకు అద్దం పడ్తోంది.

**(విశిష్ట తెలుగు దిగ్దర్శనం-సంపాదకులు: డా.తూమాటి సంజీవరావు; వెల: రూ.500; ప్రతులకు: డా॥ తూమాటి సంజీవరావు, నం.41(16ఎ), తంబయ్య వీధి, వెస్ట్ మాంబళం, చెన్నై-600033.**

– జయసూర్య

పుస్తక సమీక్ష

## మానవతా కవితా దీపం

రాయలసీమ పల్లె జీవితాన్ని మట్టి మనుషుల గాథలను కథలుగా చిత్రించిన కథకుడు పేరూరు బాలసుబ్రమణ్యం కవిగా నీటి కష్టాల్ని, రైతు బాధను, మట్టి తపన, వేదనను కవితలుగా ఉగ్గుపాల నుండే మానవతా విలువల సమాజాన్ని ఆకాంక్షిస్తున్నారు. 74 వైవిధ్య భరిత ఇతివృత్తాల సంపుటిలో పచ్చని బతుకుల్ని కమ్మేస్తున్న కాలుష్య ఆలోచనలను తరిమివేసి, మనిషిని పీడిస్తున్న తెగుళ్ల నుంచి సమాజాన్ని కాపాడుకోవాలని కవి అభిలషించటం కనపడుతుంది.



'ప్రభవిస్తావా!' అన్న కవితలో తరిగిపోతున్న అమ్మ ఆయుష్షును పెంచడానికి నా పాపవై ప్రభవిస్తావా తల్లీ! అంటారు. 'ఆడబిడ్డంటే' ఈ సంపుటిలోని తొలి కవిత భ్రూణ హత్యల మూర్ఖపు గాజు పెంకులతో, అందంలోనే తుంచేసే సమాజాన్ని శపిస్తుంది. మనుషుల మధ్య అంతరించిపోతున్న మానవతా విలువల కోసం మథనపడే ఈ సంపుటిలోని కవితలన్నీ కవి పేరూరు బాల సుబ్రమణ్యం వేదనాయుత కవితా హృదయానుభూతిని అక్షర బద్ధం చేస్తున్నాయి.

**(ఉగ్గుపాలనుండే(కవిత్వం)– రచన: పేరూరు బాలసుబ్రమణ్యం; ప్రతులకు: పేరూరు బాలసుబ్రమణ్యం, నం.22-10-14 కొరమేనుగుంట, తిరుపతి –517501**

## ప్రతిభకు పదును పెట్టే ఉద్గ్రంథం

తెలుగు రాష్ట్రాలలో 'దళిత బంధు'లనదగిన కొద్ది మందిలో డా॥ కత్తి పద్మారావు, బి.ఎస్. రాములు, ప్రభృతులు మొదటి వరుసలో నిలుస్తారు. రచయితగా పద్మారావు శతాధిక గ్రంథకర్త. హేతువాది, దళితవాది. ప్రపంచ విజేతలు సీరీస్‌లో ఇది ఏడవ గ్రంథం. పద్మారావు 89వ గ్రంథం.

మన అలవాట్లే, మన ఆచరణలే, మన వ్యక్తిత్వ నిర్మాణాన్ని నిర్ణయిస్తాయని ఉద్బోదించే పద్మారావు ఈ గ్రంథం 'వ్యక్తిత్వ నిర్మాణం'లో సాహిత్య సృజన సాంకేతిక, మానసిక విప్లవం మానవ జీవన శిల్ప నిర్మాణాలను చర్చకు పెట్టారు. వ్యక్తిత్వ నిర్మాణంలో ప్రపంచ ప్రసిద్ధులైన ఇమ్మాన్యుయేల్, సంజీవ దేవ్, తాపీ ధర్మారావు వంటి వారల సిద్ధాంతాలను చర్చించారు. ముఖ్యమైన విషయాలను హైలైట్ చేసి వివరించడం ఈ గ్రంథం ప్రత్యేకత. వ్యక్తిత్వం ప్రతి వ్యక్తిలోనూ ప్రత్యేకంగా ఉంటూ ఆ వ్యక్తి గొప్పతనాన్ని నిర్ణయిస్తుంది. పరిణతి చెందిన డా॥ పద్మారావు ఆలోచనలు, ఆచరణలు, అభ్యుదయ కాములకు అమూల్యాలు.

**(వ్యక్తిత్వ నిర్మాణం (వ్యాసాలు)-రచన: డా॥ కత్తి పద్మారావు. వెల: రూ.500/-మేలు ప్రతి రూ.1000/-; ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, పొన్నూరు.**

– కూర చిదంబరం

# మనసు భద్రం!

**మనం అన్ని విషయాలలో జాగ్రత్తగా ఉంటాం. డబ్బు, సంపద, ఆస్తులు, ఆభరణాలు భద్ర పరచుకుంటాం. చిన్న చిన్న శారీరక సమస్యలు, జబ్బులకు సకాలంలో చికిత్స చేయిస్తాం. అయితే మనసుకు వచ్చే సమస్యలు గుర్తించం. గుర్తించినా చికిత్స చేసుకోవడం పట్ల శ్రద్ధ చూపం.**

యవ్వన దశలో ప్రారంభమైన రుగ్మత కొన్ని సంవత్సరాల తరువాత తీవ్ర రూపం దాలుస్తుంది. అప్పుడు సైకియాట్రిస్టు వద్దకు పరుగులు తీస్తారు. ముదిరిన రగ్మతకు దీర్ఘకాలం, ఒక్కోసారి జీవిత కాలం మందులు వాడాల్సి వస్తుంది. దీనినే గోటితో పోయేదానికి గొడ్డలి వరకు తెచ్చుకోవడం అంటారు.

## ఆదిలోనే గుర్తించాలి

సాధారణ శారీరక జబ్బులను గుర్తించినట్టే మానసిక రుగ్మతలను కూడా ఆదిలోనే గుర్తించవచ్చు. దీనికి కొన్ని లక్షణాలను గమనిస్తే సరిపోతుంది. మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తి ప్రవర్తన, ఆలోచనలు కొంత అసహజంగా ఉంటాయి. ఉద్వేగాల ప్రదర్శనలో విపరీత ధోరణి కనిపిస్తుంది. దీన్ని గుర్తించడంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు ఉపయోగపడతారు. మానసిక నిపుణులు పరిశీలించి, పరీక్షలు చేసి నిర్ధారిస్తారు.

మానసిక అనారోగ్యానికి గురైన వారిలో విచారం, అసంబద్ధ వాదనలు, నిద్ర సమస్యలు, ఆహార సమస్యలు కనిపిస్తాయి.

సాధారణమైన కార్యకలాపాల్లో ఆసక్తి లేకపోవడం, భావోద్వేగ హెచ్చు తగ్గులు, ఆత్మహత్య ఆలోచనలు, ఒంటరితనం, భయం, ఆందోళన, సంకోచం ఎక్కువగా కనిపిస్తాయి. అతిగా తినడం, తినక పోవడం, చెప్పిందే చెప్పడం, చేసిందే చేయడం లాంటి లక్షణాలు ఉంటాయి. కొందరిలో భ్రమలు, భ్రాంతులు, అనుమానాలు వ్యక్తం అవుతుంటాయి. నిరాశ నిస్పృహ కనిపిస్తాయి. ఏకాగ్రత, జ్ఞాపక శక్తి క్షీణిస్తాయి. ఆత్మన్యూనతా భావం, ఆత్మనింద, స్వీయ హానికి తలపడుతుంటారు. సహజంగా




మానసిక రుగ్మతలతో 50 శాతం యవ్వన దశలోనే ప్రారంభం అవుతాయి. వ్యక్తిలో అసహజత్వం కనిపించిన దశలో మానసిక నిపుణులను సంప్రదించి తగిన కౌన్సెలింగ్ లేదా చికిత్స చేయిస్తే ఉపశమనం పొందుతారు.

మానసిక సమస్యలకు పలు కారణాలు ఉంటాయి. జన్యు లోపాలు, హార్మోన్ల అసమతుల్యత, మానసిక ఒత్తిళ్లు, నిద్ర లేమి, శారీరక అనారోగ్యం, పరిసరాలు, వ్యసనాలు తదితర అంశాలు మూలాలుగా మారుతాయి.

## మనసు భద్రం

మానసిక ఆరోగ్యం కాపాడుకోవడం మనచేతుల్లోనే ఉంది. ప్రధానంగా జీవనశైలిని మెరుగుపరచుకుంటే చాలు. శారీరక ఆరోగ్యం, శారీరక సామర్థ్యం మెరుగు పరుచుకోవాలి. శారీరక ఆరోగ్యం దృఢత్వం ఉన్న వారిలో హార్మోన్లు సమతుల్య స్థితిలో ఉంటాయి.

సానుకూల ఆలోచనలు, చక్కని వ్యాయామం, సరైన నిద్ర, సత్సంబంధాలు మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. జ్ఞానం, వికాసం, తార్కిక దృష్టి అలవరచుకోవాలి. సామాజిక స్పృహ మెరుగుపరచుకోవాలి. ఈర్ష్య, ద్వేషం, కసి, క్రోధం, పగ, ప్రతీకార భావాలు దరి చేరకుండా జాగ్రత్త పడాలి. స్నేహం భావం, సహాయ గుణం, క్షమించడం అలవాటు చేసుకోవాలి. చక్కని లక్ష్యాలు, మంచి అభిరుచులు పెంపొందించుకోవాలి.

మానసిక ఒత్తిళ్ల నిర్వహణ నేర్చుకోవాలి. సమయ పాలన, సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ వహించాలి.

అలాగే జీవన నైపుణ్యాలు నేర్చుకోవాలి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొందరిలో మానసిక ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. అలాంటివారు తమలో వచ్చే మార్పులను గుర్తించి నిపుణులను సంప్రదించాలి. ఆరోగ్యమే మహా భాగ్యం అంటారు. అలాగే మానసిక ఆరోగ్యం మహోన్నతికి మార్గం అన్న విషయం గుర్తించాలి. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి.

– డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి

# ఓడ లాంటి విమానం

ఇది అలాంటి ఇలాంటి విమానం కాదు. పెద్ద ఓడ లాంటి విమానం. గాలిలో ఇది ఎగురుతుంటే పెద్ద ఓడ నింగిలో తేలిపోతున్నట్లుగా ఉంటుంది. బ్రిటన్‌కు చెందిన హైబ్రిడ్ విమానాల తయారీ సంస్థ ఎయిర్‌లాండర్ ఈ భారీ విమానానికి రూపకల్పన చేసింది. బ్రిటన్‌కు చెందిన విమానాల డిజైనింగ్ సంస్థ డిజైన్ క్యూ సహాయంతో రూపొందించారు.




ఇందులో లగ్జరీ నౌకల్లో ఉండే సౌకర్యాలన్నీ ఉండటం విశేషం. విశాలమైన ఈ విమానంలో ప్రయాణికుల కోసం ఎనిమిది బెడ్ రూమ్‌లు, వాష్ రూమ్‌లు, షవర్‌లు, సువిశాలమైన లివింగ్ ఏరియా, సీటింగ్ ఏరియా, వైఫై సౌకర్యం, ఇతర వినోద సౌకర్యాలు, బార్ వంటి విలాసాలు ఉండటం.. ఈ విమానం ప్రత్యేకత.

సాధారణ విమానాలతో పోలిస్తే దీని వేగం కాస్త తక్కువే! సాధారణ విమానాల గరిష్ట వేగం గంటకు 500 మైళ్లకు పైగా ఉంటే, దీని గరిష్ట వేగం గంటకు 100 మైళ్లు మాత్రమే! ఈ విమానం వచ్చే ఏడాది నుంచి ప్రయాణం ప్రారంభించనుంది.

## అలంకరణకు అద్భుతాలు

ఇంట్లో అలంకరణకు రకరకాల బొమ్మల్ని షోకేసుల్లో పెడుతుంటాం. కొత్తవి కొన్నప్పుడు వాటిని తీసేస్తాం. కొన్నాళ్లకు వాటిని మార్చి మరో కొత్తవి పెడతాం. అలా కాకుండా ఒకే డెకరేషన్ ఐటమ్ రకరకాల బొమ్మలా మారిపోతే!? అలా ఉండాలంటే త్రీడి హోలోగ్రాఫిక్ ఫ్యాన్ పేరుతో వస్తున్న డెకరేషన్ ఐటమ్‌ను కొన్ని ఇంట్లో పెట్టుకుంటే ఆ ముచ్చట తీర్చుకోవచ్చు. సన్నటి స్టాండ్‌తో ఉండే ఈ పరికరం స్విచ్ ఆన్ చేస్తే అందమైన బొమ్మ ప్రత్యక్షం అవుతుంది. మాయ చేసినట్లుగా గాల్లో వెలుగులీనే ఆ చిత్రాన్ని చూస్తే ఆశ్చర్యపోతారు. అక్కడ ఏమీ లేకపోయినా కలర్‌ఫుల్ త్రీడి చిత్రాన్ని చూపించడమే గొప్పతనం. ఎల్ఇడి లైట్లతో ఉండే దీంట్లోని సన్నటి రెక్కలు చాలా వేగంగా గిరిగిరా తిరగడంవల్లే త్రీడి బొమ్మ మన ముందు కనిపిస్తుంది. లైట్లు, ఫ్యాన్ వేగమే ఆ ఇల్యూజన్‌కి కారణం. ఫోన్/ కంప్యూటర్ ద్వారా దీన్ని ఆపరేట్ చేస్తూ నచ్చిన బొమ్మనూ వీడియోను అందులో చూపించవచ్చు. అలంకరణలతో అతిథుల్ని అవాక్కయ్యేలా చేయాలనుకుంటే ఈ హోలోగ్రామ్ ఫ్యాన్‌ను ఇంట్లో పెట్టుకోవాలి. ఇందులో బొమ్మను బట్టి రకరకాల సైజులు అందుబాటులో ఉంటాయి. కొన్ని సంస్థలు వీటిని డిస్‌ప్లే వేదికల్లా ఉపయోగిస్తున్నారు. పెళ్లిళ్లలో వధూవరుల వీడియోల్ని ఈ సరికొత్త సాంకేతికత ద్వారా ప్రదర్శిస్తున్నారు కూడా.



## పైవా వాక్ వే

ఒకటి కాదు రెండు కాదు ఎనిమిది కిలోమీటర్ల మేర మెట్ల మార్గం. పర్యాటకులు ప్రకృతి అందాలను వీక్షించేందుకు కలపతో మెట్లమార్గాన్ని సృష్టించారు.



పోర్చుగల్‌లోని అరోకాలో పైవా నది కనిపిస్తుంది ఈ సుందర దృశ్యం. ప్రకృతి రమణీయతను ఆస్వాదించేందుకు వీలుగా ఈ మెట్ల మార్గాన్ని నిర్మించారు. దారి పొడవునా ప్రకృతి సహజ సంపద, జలపాతాలు కనువిందు చేస్తాయి. 2015లో పోర్చుగల్ ప్రభుత్వం ఈ 'పైవా వాక్‌వే'ని పర్యాటకుల కోసం అందుబాటులోకి తెచ్చింది. ఈ మెట్ల మార్గం ఎరెన్స్తో బీచ్ దగ్గర ప్రారంభమై ఎస్పిఁఇకా బీచ్ వద్ద ముగుస్తుంది. ప్రకృతి అందాలను వీక్షించేందుకు అనువుగా విశాలమైన వ్యూ పాయింట్లు, విశ్రాంతి కోసం ప్రత్యేక పాయింట్లు ఉన్నాయి. వంతెన మార్గంలో సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకే అనుమతిస్తారు. వాక్‌వేను చేరుకునే ముందే అత్యంత పొడవైన పాదచారుల సస్పెన్షన్ వంతెన ఉంటుంది. 516 మీటర్ల పొడవుండే దీన్ని 'అరోకా 516' అని పిలుస్తారు. ఈ చెక్కమెట్ల వంతెనకు వరల్డ్ ట్రావెల్ అవార్డులు కూడా వచ్చాయి. పర్యాటకుల సంఖ్య పెరుగుతుండటం వల్ల రోజువారి సందర్శకుల సంఖ్యపై పరిమితి విధించారు. యునెస్కో ఈ వాక్‌వేని 'జియాలాజికల్ హెరిటేజ్ ఆఫ్ హ్యూమానిటీ'గా గుర్తించింది.

కథ

# సాధన

పాఠశాలకి కొత్తగా వచ్చిన పంతులుగారు విద్యార్థులకు పాఠ్యపుస్తకంలోని ఒక పేరా ఇచ్చి అందంగా చూసి రాయమన్నారు.

కొద్దిమంది మాత్రమే అందంగా రాసారు. చాలామంది రాత పంతులు గారికి నచ్చలేదు. రాత బాగాలేని వారినందరినీ గంటసేపు గోడకుర్చీ వేయించారు. "రేపు ఆదివారం ఇంటి దగ్గర బాగా సాధన చేసి, సోమవారంనాడు తరగతిలో రాత బాగాలేని వారినందరూ అందంగా రాసి చూపించాలని" ఆజ్ఞాపించారు.



ఆదివారం రోజున రాత బాగోని రాము ఇంటి దగ్గ బాగా సాధన చేసి, నోట్సులో అందంగా రాసుకొని, రాసిన నోట్స్ తీసుకొని రమేష్ దగ్గరికి వెళ్లాడు.

"నేను గంటసేపు గోడకుర్చీ వేసేసరికి నా కాళ్లు బాగా నొప్పి పెట్టాయి. కొత్తగా వచ్చిన పంతులుగారు చంపుకుతింటున్నారు. కొత్త పంతులుగారు నాకు నచ్చలేదు. నేను రేపట్నుంచి ఈ బడికి రాను. ఇంకో బడిలో చేరతాను" అన్నాడు బాధతో రమేష్.

"కొత్త పంతులుగారు ఎందుకు నచ్చలేదు? అందంగా రాయమన్నారు. అది తప్పేంకాదు కదా. ఇంటి దగ్గర బాగా సాధన చెయ్యి" అన్నాడు రాము.

"సాధన చేసినా నాకు రాదురా. నా వల్ల కాదు" అన్నాడు, రమేష్.

"ఎందుకు కాదు? సాధన చేస్తే సాధ్యం కానిది ఏదీ లేదు. సాధన చేస్తే అన్నీ సాధ్యమే. నా రాత చూడు. ఎలా మారిపోయిందో? ఎంత బాగుందో.." అని తను రాసిన పేరాని, తన నోట్స్‌లో చూపించాడు.

రాము "అబ్బ... ఎంత బాగుంది నీ చేతిరాత! ఇది నిజంగా నీ రాతేనా? నమ్మలేకపోతున్నాను. నేను కూడా సాధన చేస్తాను. నేను కూడా అనుకున్నది సాధిస్తాను" అన్నాడు మారిన మనస్సుతో పట్టుదలతో రమేష్.

రమేష్‌తో పాటు పిల్లలందరూ ఆదివారం రోజు ఇంటి దగ్గర బాగా సాధన చేసి, సోమవారం తరగతిలో అందరూ అందంగా రాసి పంతులు గారికి చూపించాడు. సాధన చేసి అందరూ చేతిరాతని అందంగా మార్చుకున్నందుకు పంతులుగారు చాలా సంతోషించారు.

**- మా.శ్రీ.రాజు,** పాల్వంచ

## మంచిమాట

అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నవాడే అదృష్టవంతుడు, భాగ్యవంతుడు. అవకాశాన్ని సృష్టించుకోవటంలోనే వుంది గొప్పతనం.



వార్త ఆదివారం

## బాలగేయం

### మా పల్లె

ప్రతి గడప
అనురాగ పందిరే!
ప్రతి ఇల్లు
అనుబంధ లోగిలే!
ఏ ఇంట పండగొచ్చినా
ప్రతి ఇంట సందడి!

ఏ గడప కష్టానికైనా
ప్రతి కంట అదే తడి!
ఏ వానొచ్చి కురిసినా
ఊరంతా వయ్యారమే!
ఏ వరదొచ్చి పొంగినా
అంతా పొలిమేర జాగారమే!

అందరికీ అదే బడి
వివక్షే లేని ఒడి!
లేదండి ఏ విడి మడి
ఊరందరదీ గుడి!

ఓ సారి విచ్చేయండి
మా పల్లె ఆదర్శ గ్రామం!
కావాలి మా ఊరిలా
ప్రతి ఊరు ఆనంద నిలయం.

– తిప్పాన హరి రెడ్డి

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

ఎ.సందీప్, కోదాడ

ప్రశ్న: మందులు శరీర బరువును పెంచుతాయా?

**జవాబు:** కొన్ని మందులు శరీరతత్వాన్ని అనుసరించి శరీరం బరువును/స్థూలకాయాన్ని పెంచే అవకాశం వుంది. చాలామంది బి కాంప్లెక్స్ టాబ్లెట్లు వేసుకుంటే బరువు పెరుగుతామని అనుకుంటారు. ఇది కేవలం అపోహ. స్టెరాయిడ్ మందులు బరువును పెంచుతాయిగానీ, వాటిని తప్పనిసరి పరిస్థితులలోనే వాడాలి. అలర్జీ నివారణకు వాడే మందులు (యాంటీ హిస్టమిన్ శరీరపు బరువును పెంచే అవకాశం బాగా వుంది. ఇన్సులిన్ ఇంజక్షన్‌లు రోజూ తీసుకునే వారి బరువు కూడా పెరుగుతుంది. ఇదేమంత క్షేమకరం కాదు.

శరీరపు బరువు పెరగడానికి, స్థూలకాయం రావడానికి వ్యత్యాసం ఉందని మనం గమనించాలి. మన శరీరం మెటబాలిక్ స్థాయి మీద ప్రభావాన్ని చూపించి చురుకుదనం కోల్పోయేటట్లు చేస్తాయి. కారణమేమిటంటే శరీరం మందులను గ్రహించిన తర్వాత తక్కువ కేలరీలను ఖర్చు పెట్టుకుంటుంది, తద్వారా బరువు పెరుగుతుంది. మందులు వాడటం వలననే బరువు పెరిగినట్లయితే వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఇటీవలి కాలంలో డిప్రెషన్ మొదలైన రుగ్మతలకు మందులు వాడేవారు అధికమయ్యారు. ఇవి కూడా అనవసరమైన బరువును పెంచుతాయి. కుటుంబ నియంత్రణలో భాగంగా వాడే ఓరల్ పిల్స్ కూడా కొంతమందికి బరువును పెంచుతాయి.





ప్రదిహేను నుంచి ఇరవై నాలుగు యేండ్ల వయస్సు కలిగిన ప్రపంచ యువత చదువులు, కొలువులు లేదా నైపుణ్యాభివృద్ధి శిక్షణల్లో తప్పనిసరిగా నిమగ్నం కావాలి. దానికి విరుద్ధంగా చదువులు, కొలువులు లేదా నైపుణ్య శిక్షణలు లేకుండా నేటి యువశక్తి నిర్వీర్యం కావడం ప్రపంచ మానవాళికే శాపంగా మారే ప్రమాదం ఉందని ఐఎల్‌ఓ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

# యువతలో కొరవడిన ఉద్యోగ నైపుణ్యాలు

గత నాలుగు యేండ్లుగా ప్రపంచ కార్మిక మార్కెట్లో యువత భాగస్వామ్యం పెరగడంతో పాటు రానున్న రెండేళ్ళలో కూడా మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని 'అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్, ఐఎల్‌ఓ)' అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 12వ గ్లోబల్ ఎంప్లాయిమెంట్ ట్రెండ్స్ (గెట్) ఫర్ యూత్ 2024 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ అనంతరం 15-24 యేండ్ల యువత చదువు, కొలువు లేదా శిక్షణల్లో ఏదీ చేయకుండా ఖాళీగా ఉంటూ నేడు పెద్ద ప్రపంచ సమస్యగా మారుతున్నదని విశ్లేషిస్తున్నారు.

## కొలువు, చదువు లేదా శిక్షణలో లేని యువత,

నీట్: ఎలాంటి ప్రయోజనకరమైన పనులకు దూరంగా నిష్క్రియాత్మకంగా తిరుగుతున్న యువతను 'నాట్ ఇన్ ఎంప్లాయిమెంట్, ఎడ్యుకేషన్ ఆర్ ట్రైనింగ్, ఎన్ఈఈటీ (ఉద్యోగం, చదువు లేదా శిక్షణల్లో లేని వారు)' వర్గంగా భావించి అధ్యయనం చేశారు. 2023లో 13 శాతంగా నమోదైన నిరుద్యోగ రేటుతో 64.9 మిలియన్ల యువత ఉండగా 2019లో 13.8 శాతంగా గమనించారు. 2024లో నిరుద్యోగ రేటు 12.8 శాతానికి తగ్గవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అరబ్ స్టేట్స్, తూర్పు ఆసియా, ఆగ్నేయ ఆసియా, పసిఫిక్ ప్రాంత దేశాల నిరుద్యోగ రేటు 2019తో పోల్చితే 2023లో అధికంగా కనిపించడం విచారకరం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో గౌరవప్రదమైన ఉద్యోగాల కొరతతో నీట్ విభాగంలో యువత కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తున్నది. 2023లో ప్రతి ఐదుగురిలో ఒక్కరు, అంటే దాదాపు 20 శాతం వరకు ప్రపంచ యువత నీట్ స్థాయిలో ఉన్నట్లు తేలుతున్నది. మహిళల్లో దాదాపు 33.33 శాతం వరకు, అంటే ప్రతి ముగ్గురిలో ఒక్క మహిళ నీట్ దుస్థితిలో ఉన్నట్లు విధితం అవుతున్నది. నీట్ కెటగిరీలో జింబాబ్వే యువత 32.2 శాతం, భారత్ 23.5 శాతం, నైజీరియా 13.9 శాతం, యూకే 12.8 శాతం, ఫ్రాన్స్ 11.8 శాతం, యూఎస్ 11.2 శాతం, జర్మనీ 7.5 శాతం, చైనా 5.9 శాతం యువత ఉన్నట్లు గణాంకాలు వివరిస్తున్నాయి.



## నీట్ కెటగిరీలో యువభారతం

భారత్‌లో 25 శాతం యువతరం, అందులో 38.1 శాతం యువతులు చదువులు, కొలువులు, శిక్షణలు లేకుండా నడి బజారులో నిస్సహాయంగా నిలబడి ఉన్నారని, అబ్బాయిలు 10.2 శాతం ఉన్న విషయం విస్మయాన్ని కలిగిస్తున్నది. మన దేశంలో 2019లో నీట్ పరిధిలో 31.2 శాతం యువత ఉండగా 2023లో 23.5 శాతానికి పడిపోవడం గమనించారు. ప్రపంచ నీట్ సగటు 20.4 శాతంతో పోల్చితే 2023లో భారత్ 23.5 శాతం నమోదు కావడం కలవరానికి కారణం అవుతున్నది. భారత్ పట్టణ ప్రాంతాల్లో 20.7 శాతం, గ్రామీణ భారతంలో 24.6 శాతం నీట్ కెటగిరీ యువత ఉన్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

## యువకులతో పోల్చితే యువతులు వెనుకంజ

గౌరవప్రదమైన, అర్హతకు తగిన ఉద్యోగ ఉపాధులు లేక ప్రపంచ యువత అయోమయం, నిరాశా నిస్పృహల్లో మగ్గుతున్నారని ఐఎస్‌ఓ నివేదిక వెల్లడిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా శాంతియుత సమాజ స్థాపనకు స్థిరత్వంతో కూడిన సమ్మిళిత సామాజిక న్యాయాలు అవసరం అవుతాయని,

వీటితో మాత్రమే నేటి యువశక్తి సుస్థిరాభివృద్ధికి ఊతం ఇస్తుందని స్పష్టం అవుతున్నది.



యువకులతో పోల్చితే యువతులు ఉద్యోగ సాధనలో వెనుకబడి ఉండడం (2023లో మాత్రం యువకుల నిరుద్యోగ రేటు 12.9 శాతం, యువతులకు 13 శాతం) గమనించారు. ప్రపంచవ్యాప్తంగా నీట్ యువతలో యువతులకు 28.1 శాతం, యువకులకు 13.1 శాతం నిరుద్యోగ రేటు నమోదు అయ్యింది. 2024లో ప్రపంచ నిరుద్యోగ రేటు కొంత పెరగవచ్చనే అంచనాలు మన కలవరానికి కారణం అవుతున్నాయి.

## నీట్ సంక్షోభానికి ప్రధాన కారణాలు



అందరికీ సమాన అవకాశాలు దొరక్కపోవడం, సామాజిక అసమానతలు పెరగడం, మధ్య తరగతి ఆపై యువతలో అధిక శాతం యువత మంచి ఉద్యోగాల్లో స్థిరపడడం గమనించారు. ఆర్థిక ఇబ్బందులు, మైనారిటీ వర్గాలు, గృహ పనుల్లో మగ్గిపోవడం, సంపన్న కుటుంబాల యువత పని చేయాల్సి న అవసరం లేదని భావించడం, విద్యార్హతలకు సరిపోయే నైపుణ్యాలు కొరవడడం, మంచి ఉద్యోగాల కోసం ఎదురు చూడడం, కాలేజీల్లో పరిశ్రమలకు అవసరమైన చదువులు అందకపోవడం, ఉన్నత చదువులకు స్థోమత లేకపోవడం, సామాజిక కట్టుబాట్లలో ఇరుక్కుపోవడం, విద్యావ్యవస్థ బలోపేతం కాకపోవడం, మహిళలు నీట్ సమస్యల చట్రంలో అధిక శాతం నలుగుతున్నట్లు, వారి భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతున్నట్లు తెలుస్తున్నది.

అవాంతరాలను అధిగమిస్తూ నేటి ప్రపంచ యువత తమ నైపుణ్యాలు పెంచుకుంటూ, ఉన్నత విద్యను అభ్యసిస్తూ ఆకర్షణీయ ఉద్యోగాల్లో స్థిరపడడానికి ప్రణాళికలు అమలు పరుచుకోవాలని, ప్రభుత్వాలు కూడా ఈ దిశగా పటిష్ట అడుగులు వేయాలని సూచిస్తున్నారు.

2023-24 వివరాల ప్రకారం 15 యేండ్లు దాటిన యువత లేబర్ ఫోర్స్ పారేటిసిపేషన్ రేటు 60.1 శాతంగా నమోదు కావడం గమనించాల్సి న అంశం.

అధిక ఆదాయం కలిగిన అభివృద్ధి చెందిన దేశాల్లో 17 శాతం యువత తాత్కాలిక ఉద్యోగాల్లో ఉండగా, 76 శాతం యువత శాశ్వత ఉద్యోగాల్లో స్థిరపడ్డట్లు తెలుస్తున్నది. మధ్య ఆదాయ దేశాల్లో 17 శాతం స్వయం ఉపాధుల్లో, 22 శాతం తాత్కాలిక ఉద్యోగాల్లో, 57 శాతం శాశ్వత ఉద్యోగాల్లో పని చేస్తున్నట్లు తేలింది.

రానున్న ఈ సంక్షోభాన్ని గుర్తించి నేటి యువతను సన్మార్గంలోకి తీసుకువచ్చి, ప్రపంచ మానవాళి అభివృద్ధికి దోహదపడే విధంగా మలుచుకోవడానికి అన్ని వర్గాలు సమిష్టి కృషి చేయాలని కోరుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:**

**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

కథ



# జేబు లేని చొక్కా

సి.హెచ్.నాగార్జున శర్మ

"నారాయణా! నువ్వెప్పుడైనా, ఎక్కడైనా జేబు లేని చొక్కాని చూశావా?" అడిగాడు సుధీర్.

పరధ్యానంలో ఉన్న నారాయణ "ఆ..ఏంటి సార్! ఏంటో అడిగారు?" అన్నాడు.

"ఆ.. అదేనయ్యా! నువ్వెప్పుడైనా, ఎక్కడైనా జేబు లేని చొక్కాను చూశావా?" కాస్తంత స్వరం పెంచి అడిగాడు సుధీర్.

సుధీర్ మాటలు విన్న నారాయణ పగలబడి నవ్వుతూ.. "ఏంటీ! జేబు లేని చొక్కానా! ఊరుకోండి సార్! ఎవరైనా వింటే నవ్విపోతారు. చొక్కాకి జేబు లేకుండా ఎక్కడైనా ఉంటుందా? నన్నడిగితే అడిగారుగానీ మరెవర్నీ అడక్కండి" అని అన్నాడు.

"అరే! నేనడుగుతున్నది కరక్టేనయ్యా బాబూ! జేబు లేని చొక్కాని ఎక్కడైనా చూశావా?"

"ప్చ్! నేనైతే చూడలేదు సార్!" అని పెదవి విరిచాడు.

"మరి మీరు చూశారా?" వెంటనే అడిగాడు నారాయణ సుధీర్‌ని. "ఆ...నేను చూశాను. చూడటమే కాదు ఓ దశాబ్ద కాలం పాటు తొడుక్కున్నాను కూడాను" అని అన్నాడు సుధీర్.

"అవునా! చాలా ఆశ్చర్యంగా ఉందే! ఆ కథా కమామిషేంటో కాస్త చెప్పండి. విని తరిస్తాను" అని అన్నాడు నారాయణ.

"చెబుతాను వినండి.." అని చెప్పడం మొదలుపెట్టాడు సుధీర్.

సుధీర్ ఓ పది నెలల క్రిందటే ఉద్యోగం నుండీ పదవీ విరమణ పొందారు. అంతకు ముందు తనో కంపెనీలో పని చేస్తుండేవాడు. ఆ కంపెనీ యాజమాన్యం యూనిఫాంని మూడు సార్లు మార్చింది. మొదటి యూనిఫాం స్కై బ్లూ కలర్ చొక్కా, డార్క్ సిమెంట్ కలర్ ప్యాంట్. ఆ చొక్కాకి మీరన్నట్లుగా జేబుంది. ఆ జేబుకు అప్పటి లోగోను కుట్టించారు. ఆ యూనీఫాం ఐదేళ్ళ పాటూ కొనసాగింది.

అటు తర్వాత సంస్థ యాజమాన్యం అమెరికాలోని ఓ ఆటోమోటివ్ కంపెనీతో వ్యాపార సంబంధాలు పెట్టుకుని సంస్థ తయారు చేసే వస్తువులను విదేశాలకు అమ్మడం జరిగింది. అప్పుడు మళ్ళీ సంస్థ యాజమాన్యం రెండవ యూనిఫాంగా లైట్ సిమెంట్ కలర్ చొక్కా, డార్క్ సిమెంట్ కలర్ ప్యాంట్. ఆ సిమెంట్ కలర్ చొక్కాకి కూడా జేబుంది. ఆ జేబుకి మార్చిన లోగోని కుట్టించారు. ఆ యూనిఫాం ఓ ఆరేళ్ళ పాటూ కొనసాగింది.

మరికొంత కాలానికి సంస్థ యాజమాన్యం మూడవ యూనిఫాంని ప్రవేశపెట్టింది. ఆ యూనిఫాం పంచభూతాలకు ప్రతీకగా ఐదు రంగులతో పాటూ ఐదు విలువలను జోడించారు. ఆ ఐదు రంగులు, ఆ ఐదు విలువలు ఏవేవంటే ముదురు కుంకుమ రంగు ఆకాశం -నూతనత్వం; లేత గులాబీ రంగు-గాలిశ్రేష్టత; నారింజ రంగు-నిప్పు, వ్యాపార దక్షత; నీలి రంగు-నీరు అనుభవాలు; ఆకుపచ్చ రంగు-భూమిబాధ్యత.

ఈ ఐదు రంగుల చొక్కాలకీ డార్క్ నావీ బ్లూ కలర్ ప్యాంట్. ఈ చొక్కాలకి జేబు లేదు. జేబు లేని కారణంగా సుధీర్ కొలీగ్స్ కొసరాజు, సుందరంలు పడ్డ తిప్పలను సుధీర్‌తో ఏకరవు పెట్టుకున్నారు.

..........................

మొదటి ఉదంతం...

నీలిమ, కొసరాజులు భార్యాభర్తలు.

ఒకానొకరోజు నీలిమ కొసరాజుతో "ఏవండీ! ఇంట్లో కూరగాయలు నిండుకున్నాయి. మార్కెట్‌కెళ్ళి కూరగాయలు తీసుకురండి" అని వంద నోటు చేతికిచ్చింది.

ఆ వంద రూపాయలని కొసరాజు అలవాటులో పొరపాటుగా తను తొడుక్కొన్న చొక్కాకు జేబుందనుకుని, వంద నోటుని జేబులో పెట్టుకున్నాననుకొని మర్కెట్టుకెళ్ళాడు కూరగాయలు కొనడానికి.

కొసరాజు అలా మార్కెట్‌కి వెళ్ళగానే నీలిమ బెడ్ రూమును ఊడ్చడానికి ఉపక్రమించింది.

అలా ఊడుస్తున్న సమయంలో మంచం కింద పడి ఉన్న వంద నోటుని చూసి "అయ్యో! ఈ మనిషి కూరగాయలకని నేనిచ్చిన వంద నోటును ఇంట్లోనే పడేసుకుని వెళ్ళాడు. ఇక కూరగాయలెలా తెస్తాడో!" అని అనుకుంది లోలోన.

కొసరాజు మార్కెట్టులో కొన్న కూరగాయలనన్నింటినీ సంచీలో వేసుకున్నక డబ్బులివ్వడానికి తన చొక్కా వైపు చూస్తే, తను తొడుక్కున్న చొక్కాకి జేబు లేదు. ఆ కారణంగా నీలిమ ఇచ్చిన వంద నోటు ఎక్కడో పడిపోయిందనుకున్నాడు.

ఇంతలో కూరలిచ్చినతను కొసరాజు వాలకాన్ని గమనించి " డబ్బులు తేవడం మర్చిపోయినట్లున్నారు. ఏం ఫరవాలేదు. డబ్బులు ఈసారి మార్కెట్‌కి వచ్చినప్పుడు ఇవ్వండి. సార్! ఇప్పుడు కూరగాయలు ఇంటికి పట్టుకెళ్ళండి" అని అన్నాడు.

...................

మరికొంతసేపటికి కొసరాజు సంచి నిండా కూరగాయలతోటి హీరోలా ఇంట్లోకి దూసుకొచ్చాడు.

నీలిమ కొసరాజుతో "ఏమండీ! ఈ కూరగాయలకి డబ్బులివ్వకుండా అప్పుగా తీసుకొచ్చారు కదూ!" అని అడిగింది.

"కూరగాయలు అప్పుగా తీసుకొచ్చిన విషయం నీకెట్లా తెలిసిపోయింది?" అడిగాడు కొసరాజు ఆశ్చర్యంగా ముఖం పెట్టి.

"వడలిపోయిన మీ ముఖారవిందాన్ని చూస్తేనే తెలుస్తున్నది. అసలింతకీ మార్కెట్లో ఏం జరిగిందో చెప్పండి?" అడిగింది నీలిమ.

"నీలిమా! కూరగాయలకని నువ్విచ్చిన వంద నోటును నేను తొడుక్కున్న చొక్కాకు జేబుందనుకుని వంద నోటును చొక్కా జేబులో పెట్టుకున్నాననుకున్నాను. తీరా మార్కెట్టులో కూరగాయలన్నీ కొనుక్కున్న తర్వాత డబ్బులిద్దామని చొక్కా జేబు వంక చూస్తే అది జేబు లేని చొక్కా. సో.. నువ్విచ్చిన వంద నోటు ఎక్కడో పడిపోయింది" అన్నాడు కొసరాజు విచార వదనంతో.

ఆ మాటలు విన్న నీలిమ అగ్గి మీద గుగ్గిలంలా విరుచుకుపడి "డబ్బుల దగ్గర అంత నిరక్ష్యంగా వుంటే ఎలా? ముందు నేనిచ్చిన వంద నోటును ఎక్కడ పడేసుకున్నారో వెతికి తీసుకురండి" అని అంటే–

కొసరాజు నీలిమతో "ఇంకెక్కడి వంద నోటు! అది ఎక్కడ పడిపోయిందని వెతకను! అందునా

**"వడలిపోయిన మీ ముఖారవిందాన్ని చూస్తేనే తెలుస్తున్నది. అసలింతకీ మార్కెట్లో ఏం జరిగిందో చెప్పండి?" అడిగింది నీలిమ.**

ఈ కలికాలంలో పడిన వంద నోటు అక్కడే వుంటుందనుకుంటున్నావా! పడిన వెంటనే ఆ వంద నోటుని ఎవడో ఒకడు ఎత్తి జేబులో వేసుకుని వెళ్ళుంటాడు" అని అన్నాడు దీనంగా ముఖం పెట్టి.

..................

ఈ మాటలంటున్నప్పుడు నీలిమ కొసరాజు ముఖారవిందాన్ని చూసి వస్తున్న నవ్వుని ఆపుకోలేక పగలబడి నవ్వింది.

నీలిమ అలా పగలబడి నవ్వుతుంటే కొసరాజు కోపంతో ఊగిపోతూ "అదేంటే.. నేనొకపక్క వంద నోటు పోయిందని నేనేడుస్తుంటే, నువ్వేంటి అలా పగలబడి నవ్వుతున్నావు?"

"మీ తెలివి తక్కువతనానికి నవ్వు రాక ఏడుపొస్తుందా!?" అని మళ్ళీ పగలబడి నవ్వింది.

"ఇక నవ్వింది చాలుగానీ అసలేం జరిగిందో చెప్పు" అని అన్నాడు కొసరాజు సీరియస్‌గా ముఖం పెట్టి.

తెరలు తెరలుగా వస్తున్న నవ్వుని నీలిమ బలవంతాన ఆపుకుని "జరిగిన విషయాన్ని చెబుతాను వినండి" అని చెప్పడం మొదలు పెట్టింది.

"కూరగాయలు తేవడానికని మీకు నేనిచ్చిన వంద నోటుని మీరు తొడుక్కున్న చొక్కాకి జేబుందనుకుని అలవాటులో పొరపాటుగా పెట్టుకున్నారు. దానికి జేబు లేని కారణంగా ఆ వంద నోటు కాస్త ఇంట్లోనే పడిపోయింది. దాన్ని మీరు గమనించకుండా మార్కెట్‌కు వెళ్ళిపోయారు.

ఆ వంద నోటు ఇంట్లోనే పడిపోయిందన్న విషయం నాక్కూడా ఎప్పుడు తెలిసిందంటే... నేను చీపురుతో బెడ్ రూం ఊడుస్తున్నప్పుడు మంచం కింద అగుపడ్డది నేనిచ్చిన వంద నోటు. దాన్ని నా కళ్ళకద్దుకుని భద్రంగా బీరువాలో దాచిపెట్టాను. ఇదండీ! జరిగిన విషయం" అని అన్నది.

ఆ మాటలు విన్న కొసరాజు నీలిమతో "ఏది ఏమైనా చివరికి నువ్వు కూరగాయలు కొనడానికిచ్చిన వంద నోటు బయటెక్కడో పడిపోకుండా ఇంట్లోనే పడినందుకు నాకు చాలా సంతోషంగా ఉంద"న్నాడు.

.....................

మరొక ఉదంతం..

సుందరం అనన్యలు భార్యాభర్తలు. వారిద్దరూ బజారుకెళ్ళి ఇంటికి కావాల్సిన సరుకులు తీసుకురావాలనుకున్నారు.

అందులో భాగంగా సుందరం సెల్ ఫోన్ మాట్లాడుకుంటూ ఇంటి నుండి కొంత దూరం నడుచుకుంటూ వెళ్ళాడు.

ఇంతలో అనన్య ఇంటికి తాళం వేసి తాళం చెవులు సుందరానికిచ్చింది. సదరు సుందరం తను తొడుక్కున్న చొక్కాకి జేబుందనుకుని ఇంటి తాళలు వేసుకున్నాడు. అవి కాస్త కిందపడిపోయాయి.

అలా పడిపోయిన ఇంటి తాళాల్ని గమనించకుండా బజారుకెళ్ళి కావాల్సిన సరుకులన్నింటినీ తీసుకుని ఇంటికొచ్చారు.

ఇంటి దగ్గరకు రాగానే అనన్య సుందరంతో "ఏమండీ! ఇంటి తాళాలివ్వండి!" అని అడిగింది.

ఇంటి తాళాల కోసం సుందరం ప్యాంటు జేబులన్నీ తడిమిచూశాడు. తాళాలు లేవు.

అప్పుడు గుర్తొచ్చింది సుందరానికి "ఓహ్! షిట్! నేను తొడుక్కున్న చొక్కాకి జేబులేదని. ఆ కారణంగా ఇంటి తాళాలు ఎక్కడో పడిపోయాయి. "ఇప్పుడెలా?" అని ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి అనన్య వైపు చూశాడు.

"ఎలా? అని నా ముఖం చూస్తారేమిటండీ! తాళం కప్ప పగులగొట్టి ఇంట్లోకెళ్ళాల్సిందే! మరో మార్గం లేదికా".

మళ్ళీ అనన్యే అన్నది సుందరంతో "మీరు తొడుక్కున్న చొక్కాకి జేబుందా! లేదా! అన్న విషయం కూడా తెలియని అయోమయంలో ఉన్నారు. దానికితోడు ఆ దిక్కుమాలిన సెల్ ఫోను చూస్తూ పన్లు చెయ్యడం వల్లే ఇంటి తాళాలు పోయాయి. పోయిన తాళాలు ఎటూ పోయాయి. తాళంకప్ప పగలగొట్టాం కనుక అది ఎటూ పనికి రాదు. కాబట్టి మీరు తక్షణం బజారుకెళ్ళి తాళంకప్ప ఒకటి కొనుక్కురండి" అని అన్నది.



సుందరం తాళం కప్ప కొనుక్కురావడానికి బజారుకెడుతుంటే ఇంటి మలుపులో తన ఇంటి తాళం చెవులు పడున్నాయి. వాటిని తీసుకుని పరుగెత్తుకుంటూ ఇంటికొచ్చి అనన్యతో "మన ఇంటి తాళం చెవులు దొరికాయి" అని అంటే–

"సాధించాడండి పెద్ద ఘనకార్యం!" అని అంటూ– భర్తతో "ఇంటి తాళాలు దొరకడమన్నది తాళం కప్పను పగలకొట్టకముందు దొరికివుంటే బాగుండేది. తాళం కప్పను ఎటు పగలుకొట్టేశాంగా! కనుక మీరు తక్షణం బజారుకెళ్ళి తాళం కప్పను కొనుక్కుని రండి.. వెళ్ళండి" అని అనన్య సుందరాన్ని తొందరపెట్టసాగింది.

....................

"ఏమండీ! మా కొలీగ్స్ ఐన కొసరాజు, సుందరంలు జేబు లేని చొక్కా వేసుకుని పడ్డ తిప్పలు" అని అన్నాడు సుధీర్ నారాయణతో.

సుధీర్ చెప్పిన ఉదంతాల్ని విన్న నారాయణ సుధీర్‌తో "సర్! మీరు చెప్పినదంతా విన్న తర్వాత నాకో చిన్న సందేహం కలిగింది. దాన్ని నివృత్తి చేస్తారా?" అని అడిగాడు.

"ఓ యస్. తప్పకుండా! మీ సందేహం ఏంటో చెప్పండి"

"ఈ అయిదు రంగుల చొక్కాలకీ జేబులు పెట్టకపోవడానికి కారణం ఏంటో తెలియజేస్తారా?"

సంస్థ యాజమాన్యం యంత్రాల దగ్గర పని చేసే కార్మికుల భద్రతని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయం. ఎందుకంటే యంత్రాల దగ్గర పనిచేసే ఉద్యోగస్తుల చొక్కాకు జేబుంటే పెన్ను, పెన్సిలు, పేపర్లు, సెల్ఫోన్లు, కాగితాలు, బోల్టులు, నట్లు పెట్టుకుని పనిచేస్తుంటారు. వారు యంత్రాల దగ్గర వంగి పని చేసేటప్పుడు జేబులో పెట్టుకున్న వస్తువులేవన్నా యంత్రాలలో పడినప్పుడు వాటిని తీసుకొనడానికి ఆపరేటరు చేతులు పెట్టడానికి అవకాశం ఉంది. అలాంటి సమయాలలో అతను ప్రమాదానికి గురై చేతివేళ్ళు పోగొట్టుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఇలాంటి ప్రమాదాలకి వారు గురికాకూడదన్న ముఖ్య ఉద్దేశంతో ఈ ఐదు రంగుల చొక్కాలు జేబు లేని చొక్కాలు అయ్యాయి" అని చెప్పాడు సుధీర్.


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

# విద్యా సంస్కరణలలో తెలుగు పాఠశాల

గుంట ఓనమాలు దిద్దించే గురువుల కాలం, వీధి అరుగుల బడి చదువు, పాఠశాలల భవన నిర్మాణాల స్థాయికి ఎదిగిన ఆధునిక విద్యా విధానంలో ప్రస్తుతం ఉపాధ్యాయులు కంప్యూటర్, మొబైల్‌కు అతుక్కునే డిజిటల్ యుగంలో ప్రవేశించారు. బ్లాక్‌బోర్డులు, చాక్‌పీసులు కనుమరుగై, హాజరు పట్టీలు కూడా అవసరం లేని ఆన్‌లైన్ సేవలు రంగప్రవేశం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల స్థితిగతులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య నానాటికి తగ్గి మూతపడే దుస్థితి ప్రాప్తించే పరిస్థితి నెలకొని వుంది. ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పేరిట విద్యార్థులకు వేల రూపాయల పంపిణీ కారణంగా తల్లిదండ్రుల దృష్టి బోధనకే పరిమితమై ప్రైవేట్ విద్యాసంస్థలపై పడుతోంది.



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బోధనేతర విధులతో సతమతమవుతూ, ఉన్నతాధికారుల ఒత్తిడికి తల ఒగ్గుతుండటంతో అన్ని పాఠశాలల్లో బోధన సమయం హరించుకుపోతోంది. కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం, రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు గిన్నిస్ రికార్డుల తపన, తాపత్రయం ప్రభుత్వ పాఠశాలలను విద్యకు దూరం చేసి క్రమేపీ ఆ బాధ్యత నుంచి తప్పుకొని బడా ప్రైవేటు విద్యారంగానికి కట్టబెట్టే భవిష్యత్ ఊహించాల్సి వస్తోంది.

ఏ ప్రభుత్వమైనా విద్య, వైద్యం బాధ్యతాయుతంగా ప్రజలకు అందించాలి. సమకాలీన సమాజంలో వైద్యం విషయంలో ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రభుత్వాలు చూపిస్తున్న శ్రద్ధాసక్తులు, విద్యారంగం పట్ల చూపించలేకపోతోంది. దానికితోడు కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుగుణంగా తల్లిదండ్రులు ఆంగ్ల మాధ్యమానికి ప్రాధాన్యం యిస్తుండటంతో ప్రైవేట్ విద్యాసంస్థలు మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లుతున్నాయి. మాతృభాషలో విద్యాబోధన కాకుండా, ఆంగ్ల భాషా మాధ్యమానికి పరోక్షంగా ప్రాధాన్యత యివ్వటం వల్ల పేదలు, మారుమూల ప్రాంతాల జన సామాన్యం అక్షరాస్యతకు మరింత దూరమయ్యే ప్రమాదం భవిష్యత్‌లో ఎదుర్కోక తప్పదు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మోడల్ ప్రాథమిక విద్య బలోపేతం కావాల్సి వుంది. పాఠశాల సమయం అంతా నాణ్యమైన విద్య నేర్పటానికి కేటాయించాలి. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటుకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫామ్, బెల్ట్, షూ, ఉపకార వేతనాలు, మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వం అందిస్తోంది. అయినా గ్రామాలలో తల్లిదండ్రులు ఎక్కువగా ప్రైవేటు పాఠశాలలకు ఆకర్షితులవడంతో ప్రభుత్వ పాఠశాలలలో చేరికలు ప్రతీ సంవత్సరం తగ్గుతున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. విద్యాశాఖలో సంస్కరణ శకం నడుస్తోంది. విద్యను అత్యంత ప్రాధాన్యతా రంగాలలో ముఖ్యమైనదిగా ప్రభుత్వం గుర్తించింది. ఒకటి నుంచి ఐదు తరగతులలో 60 లోపు విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలను బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా, 60 పైన విద్యార్థులుంటే మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలలకు ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయునితో పాటు తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున అయిదుగురుని కేటాయించారు. 60 మంది కంటే ఎక్కువ వుంటే యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసారు. గతంలో ఉన్న ఆరు రకాల పాఠశాలలకు బదులు 10 రకాల పాఠశాలల విద్యా విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు తెచ్చింది. మొదటిసారిగా మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. 44,956 పాఠశాలల్లో 25.46 లక్షల తల్లిదండ్రులు, 27,395 మంది పూర్వ విద్యార్థులు, 22,200 మంది దాతలు, 36,918 మంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సంస్కరణలు, లోపాల పరిష్కార మార్గాలు అవసరమే. విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా వున్న జీవోకు స్వస్తి పలకవలసినదే. తల్లికి వందనం పథకం కోసం మొత్తం రూ.10,091 కోట్లు ఎపి ప్రభుత్వం విడుదల చేసింది. ఎంతమంది పిల్లలుంటే అంత మందికి 'తల్లికి వందనం' ఇస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుండి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠ్యాంశాలలో సమూల మార్పులు తీసుకొస్తున్నారు. ఈ సంస్కరణల సత్ఫలితాలకోసం వేచి చూడాల్సిందే. ప్రభుత్వ బడుల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. సెల్‌ఫోన్ ప్రభావం బాలబాలికల పైన, ఉపాధ్యాయుల బోధన పైనా పడుతోంది. రోజువారీ యాప్‌లతో రకరకాల సమాచారం అప్‌లోడ్, డౌన్‌లోడ్‌తో ఉపాధ్యాయులు యిప్పటికే సతమతమవుతున్నారు. దినదినాభివృద్ధి సాధిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం అవసరం మేరకు వినియోగించు కోవటం ముఖ్యం, అతిగా ఆధారపడితే దానికి బానిసలుగా మారి కర్తవ్యం మరుగున పడే ప్రమాదం పొంచి వుంది.

**- యర్రమిల్లి**

# గుజరాత్ రాష్ట్ర సాంస్కృతిక రాజధాని 'వడోదర'

గుజరాత్ రాష్ట్రంలోని ప్రముఖ నగరాలలో ఒకటి వడోదర. ఒకప్పుడు దీన్ని బరోడా అని పిలిచేవారు. 'వడోదర' అనే పేరు 'వడ' అనే నామంతో వచ్చింది. వడ అంటే మర్రిచెట్టు అని అర్థం. ఒకప్పుడు ఈ ప్రాంతమంతా వట వృక్షాలతో నిండి ఉండేది. ఆ కారణంగా దీనికి వడోదర అనే పేరు వచ్చింది. రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ నగరం గుజరాత్ రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా విరాజిల్లుతోంది. ఇక్కడి 'లక్ష్మీవిలాస్ ప్యాలెస్'కు 125 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇది బరోడా మహారాజుల చారిత్రాత్మక భవనం, హైదరాబాద్ నిజాములు, గ్వాలియర్ సింధియాలు, జైపూర్ రాచరిక కుటుంబీకులైన అత్యంత సంపన్నుల సరసన బరోడా గైక్వాట్లు కూడా వుంటారు. బరోడాను పరిపాలించినవారిలో అత్యంత ప్రఖ్యాతి చెందిన వ్యక్తి, విశిష్టుడు సాయాజీరావ్ గైక్వాడ్, బరోడా రాజ్యానికి అత్యంత ప్రఖ్యాతి పొందిన మహారాజా, విద్యా ప్రియుడు, సామాజిక సంస్కర్త.

## లక్ష్మీ విలాస్ ప్యాలెస్

వడోదరలోని లక్ష్మీ విలాస్ ప్యాలెస్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ నివాస భవనం. లండన్ క్వీన్ కంటే ఇది పెద్దది. బకింగ్హామ్ ప్యాలెస్ కంటే నాలుగు రెట్లు పెద్దది. ఇది పురాతన పద్ధతిలో నిర్మించిన ప్రాచీన భవనం. ఇక్కడ నివాసం సరిగ్గాలేదని గ్రహించిన మహారాజా సాయాజీరావు మరో సరికొత్త ప్యాలెస్‌ను నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నాడు. దాని పేరే 'లక్ష్మీవిలాస్'. ఈ ప్యాలెస్ నిర్మాణం 1881లో ఆరంభమై, 1890కి ముగిసింది. అంటే దీని నిర్మాణానికి తొమిదేళ్ళ వ్యవధి పట్టిందన్న మాట. దీని నిర్మాణవ్యయం అప్పట్లో 60 లక్షల రూపాయలు. రాచరిక ఇంజనీర్లలోని బ్రిటిషు అధికారి మేజర్ చార్లెస్ మాంటే ఈ భవంతి డిజైనర్. భవనానికి బ్రిటిష్ నివాసి మెల్వెల్లె అనే వ్యక్తి శంకుస్థాపన చేశాడు. భారతీయ మహారాజుల రాజభవనం అనగానే ఏ విధమైన ఊహ కదలాడుతుందో, ఎంతటి అద్భుతమైన రూపం ఉంటుందో లక్ష్మీవిలాస్ అందుకు కొంచెమైనా తీసిపోదు. సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన టవర్లు, ఆర్చీలు, డోమ్లతో




వుంటుంది. పూర్తి భవనానికి అవసరమైన రాతిని సోనాగడ్ కోటలోని క్వారీనుంచి తీశారు. భవనాన్ని దగ్గరగా చూడగానే భారతదేశంలో రాచరిక వ్యవస్థ నాటి ఉజ్వలమైన దృశ్యమాలిక కనులముందు కదలాడుతుంది. జీనులు జీరాడే ఐరావతాలు, పరదాలు వేలాడే పల్లకీలు, రకరకాల పనులతో హడావిడిగా తిరిగే పరిచారికలు, మహారాజ భవనం దృశ్యం, భారతీయ, యూరోపియన్ శైలిలో రెండింటినీ మేళవించి, తన ప్రయత్నంలో సఫలీకృతుడయ్యాడు.

ప్యాలెస్ వెలుపలగల ఎన్నో అలంకరణ సామాగ్రిని భరత్పూర్ కోటనుంచి తీసుకువచ్చారు. ఎన్నో రకాల ఆర్చిలలో వెనీషియన్ ఆర్కిటెక్చర్ కన్పిస్తే, ఇంకొన్ని చోట్ల గోతిక్ సూచనలు గోచరిస్తాయి. ఆర్కిటెక్ట్ అనేక విధాల స్టయిల్స్‌ను అవసరాన్ని బట్టిజొప్పించారు. ప్రాసాదాల కట్టడానికి మొఘలాయి నిర్మాణశైలి, కిందికి వంగి వేలాడినట్లుండే పైకప్పులకు బెంగాలీ శైలి, అదే విధంగా డోమ్స్, టవర్లకు గుజరాతీ ప్రభావం, రాజపుత్ర నిర్మాణ శైలి ప్రభావితం చేసినట్లు కనిపిస్తాయి.

## సువిశాల విస్తీర్ణం

సువిశాల బరోడా మహారాజుల భవనం 720 ఎకరాల సువిశాల స్థలంలో వుంటుంది. ప్యాలెస్ చుట్టూ తోట, అందమైన శిల్పాలు వుంటాయి. ఇటలీ శిల్పి ఫెలిసి ఇత్తడితో అనేక జంతువులు, మనుషులశిల్పాలు తయారు చేశాడు. ప్యాలెస్ చుట్టూ గల పదిమైళ్ళ ఫుట్పాత్ వెంబడి ఎన్నో రకాల చెట్లు, మొక్కలు, గట్టి ఉంటాయి. ఎవరైనాసరే ఈ దారిలో గంటలకొద్దీ నడుస్తూ కాలం గడిపేయవచ్చు. ప్యాలెస్ ఫ్లోరింగ్‌కు ఇటలీ మార్బుల్‌ను విస్తారంగా ఉపయోగించారు. నైపుణ్యం గలిగిన పనివారిని ఫ్రాన్స్ నుంచి తీసుకువచ్చారు. అధునాతనమయిన ప్యాలెస్‌లో గదుల నిర్మాణంలో సాధారణ అవసరాలతో పాటు కొత్తదనాలను సృష్టించాలనేది డిజైనర్ల ప్రధాన ఉద్దేశంగా ఈ భవనం రూపు దిద్దుకున్నది. సాధారణంగా భారతదేశంలోని అన్ని ప్యాలెస్‌లలో మూడు విభాగాలు ఉంటాయి.

మహారాజ వ్యక్తిగత విభాగం, మహిళల నివాసం, దర్బార్ హాలు వంటి పబ్లిక్ ప్రాంతం వుంటాయి.బరోడా భవనంలోని దర్బార్ హాలు 93 అడుగుల పొడవు, 54 అడుగుల వెడల్పుతో, ఏ ప్రత్యేక సందర్భంలోనైనా వెయ్యిమంది పరివారం కూర్చోవడానికి వీలుగా వుంది. దర్బార్ హాలులో వెనీషియన్ మొజాయిక్ ఫ్లోర్ వేయడానికి మురానోకు చెందిన పన్నెండు మంది పనివారికి పద్దెనిమిది నెలల వ్యవధి పట్టింది. హాలుగోడలలో ఏర్పాటు చేసిన గూళ్ళలో బరోడా పరిపాలకుల బస్ట్ సైజు ఇత్తడి విగ్రహాలను అమర్చారు. ఈ సువిశాలమైన హాలులో 6 అందమైన వెనీషియన్ షాండ్లియర్స్ వెలుగులు విరజిమ్ముతుంటాయి. సీతారాముల జీవిత సన్నివేశాల చిత్రీకరణగల స్టెయిన్డ్ కిటికీ అద్దాలు ఈ గది ప్రత్యేకత, సీలింగ్ ఏర్పాటు మరో ప్రత్యేక ఆకర్షణ. భవనంలోని వివిధ విభాగాల్ని ఫౌంటెన్లు, యూరోపియన్ విగ్రహాలు, రమణీయమైనఫామ్స్ మొక్కలతో గల ఆవరణలో తెలివిగా విభజించారు. ఒక ఆవరణ మధ్యలో 8 అడుగుల ఎత్తయిన ఐరన్ ల్యాంప్ వుంటుంది. ఇంకో దానిలో గోల్డ్ ఫిష్ ల ఫౌంటెయిన్ వుంటుంది. వెనీషియన్ మొజాయిక్ ఫ్లోరింగ్‌తో ఆకాశంవైపు చూసే బాటిల్పామ్స్ వుంటాయి. ఓ మూల సితార వాయించే తెల్లని స్త్రీ విగ్రహం ఉంది. చక్కని గాలి వెలుతురు వచ్చేలా డిజైన్ చేసిన ఫార్మల్ గదులు లక్ష్మీ విలాస్ మొదటి అంతస్తులో వుంటాయి. మధ్యస్థమైన వైశాల్యంతో వుండే సిల్వర్ రూమ్ను డ్రాయింగ్ రూమ్ ఉపయోగిస్తారు. ఈ గదిలో సిల్వరంగును ఎక్కువగా వాడినందున దీనిని ఈ పేరుతో పిలుస్తారు. సీలింగ్, గోడలు, ఉడ్వర్క్ ఫర్నిచర్ అన్ని నగిషీలు చెక్కి లేదా పెయింట్ చేసి వుంటాయి. ఇవి లూయిన్ 14,15 కాలం నాటివి.



మూడు తరాల చిత్రపటాలు సీలింగ్ నుంచి అతి సున్నితమయిన వెనీషియన్ షాండ్లియర్స్ వేలాడుతుంటాయి. బరోడా పాలకుల మూడు తరాలకు సంబంధించినవారి చిత్రపటాలు గోడలకు తగిలించి వుంటాయి. కుటుంబ ఫోటోలు వెండి ఫ్రేములు బిగించి మార్బుల్ పరిచిన టేబుల్స్ పై కనిపిస్తాయి. గోడల డిజైన్లు సహజసిద్ధమైన ఆకులు, పువ్వులు, రిబ్బన్లు, ఫ్రేమ్ చిహ్నాలు, రాచరికానికి సంబంధించిన అంశాలతో నిండి ప్రత్యేకంగా కనిపిస్తాయి. డైనింగ్ రూమ్‌లో గోడలన్నవే కనిపించవు. పూర్తిగా బర్మాటేకు అలమరలతో కప్పేసి వుంటాయి. వాటిపై బంగారు రంగు లతల నగిషీలు మెరిసి పోతుంటాయి. వాటిపై మధ్యమధ్యన బిగించిన లాంప్స్ రోమన్ టార్చిల ఆకృతిలో వుంటాయి. గదికి మ్యాచింగ్‌గా వుండే కుర్చీలకు మొరాకో లెదర్ బిగించారు. ఓ వైపు అలమరపై కుటుంబ సభ్యుల ఫోటో అమర్చారు. గది ఫ్లోరింగ్ అంతా ఒకే ఎర్రతివాసీ పరిచి వుంటుంది. సీలింగ్‌ను ప్రత్యేకంగా అలంకరించి, లోపల లైట్లు అమర్చారు. ఈ భవనంలో మరో ప్రధాన భాగం వరండా. డిన్నర్‌కు ముందు అతిథుల్ని వినోదపరచడానికి కుటుంబ సభ్యులు దీన్ని ఉపయోగిస్తారు. ఇది ప్యాలెస్ ముఖద్వారంలో భాగంగా వుంటుంది. నగిషీలు చెక్కిన రాతి స్తంభాలు సీలింగ్‌ను తాకుతుంటే, ఫ్లోర్‌పై బర్మాటేకు ఉపయోగించారు. అక్కడక్కడ పెట్టిన కుండీల్లోని మొక్కలు పచ్చని అందాలు వెదజల్లుతుంటాయి. వర్షాకాలంలో ఈ వరండా చక్కని అనుభూతులనిస్తుంటుంది. లక్ష్మీవిలాస్ వయస్సు ఇప్పటికి 125 యేళ్ళు దాటింది. ఆనాటి రాచరికానికి సంపదకు స్మృతి చిహ్నంగా నిలిచి వుంది. నేడు ఇక్కడ గైక్వాడ్ రాచరిక కుటుంబీకులు నివసిస్తున్నారు. నాటి ఐరావతాలు, అశ్వాల స్థానంలో ఆధునిక యంత్రాలు కన్పిస్తాయి. కాని, ఆనాటి ప్రతిష్టాక రమైన ఈ కట్టడం సంస్కృతీచిహ్నంగానే మిగిలి వుంది.

## చూడదగిన ప్రదేశాలు

ప్రతాప్ విలాస్ ప్యాలెస్, మకార్పురా ప్యాలెస్, నజార్బాగ్ ప్యాలెస్, మహారాజా ఫతేసింగ్ మ్యూజియం, సయాజీరావ్ విశ్వవిద్యాలయం, కీర్తి స్తంభం, కీర్తిమందిర్, హాజీరా మక్బరా, బరోడా మ్యూజియం, లాల్‌బాగ్, సర్దార్బాగ్ మొ॥ అనేక పర్యాటక ప్రదేశాలు వడోదరలో ఉన్నాయి. మహారాజా సాయాజీరావ్ గైక్వాడ్ విశ్వవిద్యాలయం భారతదేశంలోనే అత్యంత పాత పబ్లిక్ యూనివర్సిటీలలో ఒకటి. దీన్ని గుజరాత్ గౌరవంగా భావిస్తారు. ఇది వడోదరను శిక్షణ నగరంగా ప్రసిద్ధి చెందేలా చేసింది. వడోదర రైల్వే స్టేషన్ రూపకల్పనను లండన్ స్టేషన్ ఆర్కిటెక్ట్లు స్ఫూర్తిగా తీసుకున్నారు. రాత్రివేళ లైట్ల వెలుగులో అది చాలా అందంగా మెరిసిపోతుంది. లక్ష్మీవిలాస్ ప్యాలెస్‌లో 18 హోల్స్ గోల్ఫ్ గ్రౌండ్ ఉంది. ఇది ఒక రాజభవనంలో ఉండటం వింత విశేషం. వడోదరలో గాలి కూడా చరిత్ర చెబుతుంది. గుజరాత్‌లో అతిపెద్ద పార్క్ సాయాజీ బాగ్ (కమతి బాగ్), ఇది ఒకేచోట జూతో పాటు మ్యూజియం, ఫౌంటెన్, టాయ్ ట్రైన్ అన్నీ కలిగిన అద్భుత స్థలం. బ్యాంక్ ఆఫ్ బరోడా ఇక్కడి నుంచే 1908లో ప్రారంభమైంది. అది తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించింది.

– షేక్ అబ్దుల్ హకీం జాని

# మా ఇంటికి వీధిపోటు వర్తిస్తుందా?




వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్స్: 9885446501/9885449458




**సి.ప్రతాప్, కాకినాడ**

**ప్రశ్న: మా ఇంటికి దక్షిణ భాగంలో ఒక ఇల్లు ఉంది. వాళ్లకి దక్షిణ నైరుతి వీధిపోటు ఉంది. వాళ్ల ఇంటి పక్క మా ఇల్లు అదే లెవల్‌లో వరుసగా నైరుతి వీధిపోటు మాకు ఉంది. అంటే ఆ వీధిపోటు వాళ్లకే వర్తిస్తుందా? మా ఇంటికీ వర్తిస్తుందా? ఆ ఇంటి ఇల్లాలు ఉరి వేసుకుని మరణించింది. ఆ వీధిపోటు ఆ లైనులో ఉన్న అందరికీ వర్తిస్తుందా? ఒకవేళ ఉంటే దానికి పరిష్కారం చెప్పగలరు.**

**జవాబు:** చాలా మందికి ఈ సందేహం ఉంటుంది. పక్క ఇండ్లకు తగిలే వీధిపోటు చెడు ఫలితాలు ఆ ఇంటికి పక్కనే ఉన్న తమ ఇండ్లకు కూడా వర్తిస్తాయా? లేదా? అన్న మీ మీమాంస కొట్టుమిట్టాడుతూ ఉంటుంది.

మీ ఇంటికి (బి) పక్కన దక్షిణాన ఉన్న ఇంటికి (ఎ) దక్షిణ నైరుతిలో వీధిపోటు తగులుతున్నప్పుడు, ఆ వీధిపోటు తీవ్రత ఆ ఇంటికి(ఎ) ప్రత్యక్షంగా చెడు ప్రభావాన్ని చూపిస్తుంది. ఆ తరువాత ఇంటికి కూడా వీధిపోటు ప్రభావం ఉంటుంది. కానీ అంత తీవ్రంగా ఉండదు. (బి) స్థలంలో కట్టిన గృహ నిర్మాణం పద్ధతిని బట్టి ప్రహరీ గోడల హద్దులను బట్టి వీధిపోటు తీవ్రత తగ్గుతుంది. ఎట్టి పరిస్థితుల్లో కూడా 'ఎ' ఇంటి కంటే 'బి' ఇంటికి దక్షిణ నైరుతి వీధిపోటు తీవ్రత తక్కువగానే ఉంటుంది.

స్థల వైశాల్యాన్ని బట్టి 'ఎ' చాలా పెద్ద స్థలమైనప్పుడు 'బి'కి వీధిపోటు ప్రభావం ఒక్కోసారి అసలు ఉండకపోవచ్చు కూడా. వీధిపోటు తగిలిన క్షేత్రంలో దుర్ఘటన జరిగినట్లు వివరించారు.

మీరు ఆ ఇంటి పక్కనే ఉన్నారు కనుక మీ ఇంటికి సంబంధించినంత వరకు వీధిపోటు తీవ్రతను తగ్గించే 'రెమిడీస్' చేసుకొని జాగ్రత్త పడటం మంచిది. వ్యక్తిగతంగా సంప్రదించి వివరాలు తెలిపి రెమిడీస్ పద్ధతులు తెలుసుకోవచ్చు.

## బీరువా తలుపు ఉత్తరం ముఖం వైపు ఉండవచ్చా?

**ఎస్.కోమలి, పరిగి**

**ప్రశ్న: మాది తూర్పు ముఖం ఫ్లాట్. మూడో ఫ్లోర్. దక్షిణంలోను, నైరుతిలోను బెడ్ రూమ్‌కి అటాచ్డ్ బాత్ రూమ్స్, లెట్రిన్స్ ఉన్నాయి. (వెస్ట్రన్ టాయిలెట్స్, ఫ్లోరింగ్ కంటే ఎత్తుగా) వుండవచ్చా? బీరువా నైరుతి మూల, తలుపు ఉత్తరానికి తెరుచుకునేటట్లు, ఉత్తరం ముఖంగా పెట్టాం. సరైన స్థలంలోనే పెట్టామా? నీళ్ల ట్యాంక్ ఆగ్నేయం(వంట ఇంటిపైన ముందు) భాగంలో ఉన్నది.**

**జవాబు:** బాత్‌రూమ్స్‌లో వెస్ట్రన్ టాయిలెట్స్, ఫ్లోరింగ్ కంటే ఎత్తుగా ఉండవచ్చు. బీరువా పెట్టిన స్థానం సరైనదే. బీరువాకు ఎదురుగా బాత్‌రూమ్ తలుపు ఉండకూడదు.

ఆ విధంగా బీరువాను మార్చుకోండి. ఆగ్నేయం అగ్నిప్రధానమైన దిక్కు. అక్కడ నీటి నిలువలు ఉండకూడదు. అందుకని వంటగది పైన ఆగ్నేయ మూలలో నీళ్లట్యాంక్ ఉండకూడదు. నీళ్ల ట్యాంక్‌ను అక్కడి నుంచి ఇంటికి దక్షిణ లేదా నైరుతి లేదా పశ్చిమ దిక్కుకు స్లాబ్ పైన మారనచటం మంచిది. వీలైతే ప్లానుతో వచ్చి సంప్రదించి ట్యాంక్‌కు సంబంధించిన స్థాన నిర్ణయం తెలుసుకోవచ్చు.

---

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:

**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................

పుట్టిన తేది : ............................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................

చిరునామా:............................................

# ఉత్తరాలెప్పుడూ విలువైనవే!

ఉత్తరాలు ఎప్పుడూ విలువైనవే. మంచో చెడో ఏదైనా కావచ్చు... పాత, కొత్తలతో సంబంధం లేకుండా ఉత్తరాలు మిగిల్చే జ్ఞాపకాలు ఎప్పుడూ మనతోనే ఉంటాయి. నిజానికి ఒకరి ఉత్తరాలు మరొకరు చదవకూడదు. అలా చదివితే కుసంస్కారం అవుతుందంటారు. కానీ అవి పుస్తకాలుగా అచ్చయి పాఠకలోకానికి వచ్చాయంటే అవి సామాన్యమైనవి కావుగా!

గాంధీజీ, జవాహర్‌లాల్ నెహ్రూ, గురజాడ అప్పారావు, చలం, సంజీవ దేవ్.. ఇలా ఎందరో ఎందరెందరో రాసిన ఉత్తరాలు పుస్తకాలుగా వెలువడ్డాయి.

ఇప్పుడు సెల్ ఫోన్లు వచ్చి ఉత్తరాలు రాసుకోవడమనేదే కనుమరుగైపోయింది. పొట్టి పొట్టి మెసేజులతో సరిపెట్టుకునేవారే అధిక శాతం మంది. వాట్సప్, ట్విట్టర్ వంటివి వాడుకలోకి వచ్చిన తర్వాత ఒకరికొకరు విషయాలు పంచుకుంటున్నారు. అందులోనే ఒకరు పంపినదే మరి కొంతమందికి పంపడం సర్వసాధారణమైపోయింది. నాకిలాంటి ఫార్వర్డ్ మెసేజులు కుప్పలు తెప్పలు.

నాకు గత కాలపు ఉత్తరాల పర్వమే ఎంతో ఇష్టం. వాకిట్లోకొచ్చి "సార్! పోస్ట్" అనే గొంతు విని ఉత్తరం అందుకుని చదవడంలోని ఆనందమే వేరు. ఈ రోజుల్లో ఎవరికైనా ఉత్తరం రాసి జవాబుకోసం ఎదురు చూద్దామంటే వాట్సప్‌లో ముక్తసరిగా ఓ రెండు మాటలతో రిప్లయ్ ఇస్తారు.

కొన్నేళ్ళ క్రితం నేనూ, నా మిత్రులు ఒకరికొకరం ఉత్తరాలు రాసుకోవడం మొదలు పెడదామనుకున్న మాట మాటగానే మిగిలిపోయింది. ఇక ఉత్తరాలు రాసుకుని అవి చదివే రోజులు రావా అని ప్రశ్నించుకుంటే "ఇంకెక్కడిదా వైభోగం?" అనే జవాబు వస్తోంది.

ఇటీవల ఏవో పాత పుస్తకాల కోసం వెతుకుతుంటే రెండు ఉత్తరాలు బయటపడ్డాయి. ఒకటేమో పీబీ శ్రీనివాస్ గారు నాకు రాసిన పోస్ట్ కార్డు (1981 డిసెంబర్ 12న రాసినది). మరొకటి మా నాన్నగారికి ఆయన శిష్యురాలు రాసిన ఉత్తరం.

మా నాన్నగారికి శిష్యురాలు గుడిపాటి విజయలక్ష్మి రాసిన లేఖలోని విషయం..

మహారాజశ్రీ పూజ్యులయిన తెలుగు మాస్టారుకి విజయలక్ష్మి నమస్కరించి వ్రాయునది. ఎవరా ఈ విజయలక్ష్మి అని ఆశ్చర్యపోతున్నారు కదండీ బహుశః నేను పి.రమణమ్మ వాళ్ళతో మీ దగ్గర సంస్కృతం చదివిన విద్యార్థినులలో ఒకరినని చెబుతే మీకు గుర్తు రావచ్చుననుకుంటాను. బీఏలో నేను హిస్టరీ, పాలిటిక్స్, తెలుగు



తీసుకున్నాను. రామచంద్ర శాస్త్రిగారు (ప్రైవేటు మాస్టారు) నన్ను తెలుగే తీసుకోమన్నారు. తెలుగు చదవడం సరదాగా ఉన్నా ఎంత కష్టమో అర్థమైంది. నేను అప్పకవీయం, కవిజనాశ్రయం, బాల వ్యాకరణం, ప్రౌఢ వ్యాకరణం ప్లస్ 100 అలంకారాలు చదివాను. కానీ ఎప్పుడైనా మీరు గనక ఎదురుపడి ఫలానా పద్యం ఛందస్సు గురించి అడిగితే ఒక్క ముక్క రాదండీ. మీరు ఒకసారి ఒక కథ చెప్పారు. అలాగ చదువంతా అయ్యాక గురువుగారి విద్య గురువుగారికి అప్పగించి వచ్చేశాను. మా అమ్మ గారికి కేన్సరు వచ్చింది, నేను ఫైనల్ ఇయర్‌లో ఉండగా. అదీకాక ఈ పై చెప్పినవే కాక 15 పుస్తకాలు ఇవన్నీ కలిసి కొన్నాళ్ళకి నా మతిభ్రమించి చచ్చి ఫెయిల్ అనే మాట అనిపించుకోకుండా యూనివర్సిటీ వాళ్ళ పుణ్యమా అని తోసేసారండి బాబూ. చూశారా? మీ శిష్యురాలి ప్రతాపం. మీ శ్రీమతి గారికి నా నమస్కారములు తెలుపవలెను. మీరు తెలుగు కాంపోజిషన్ దిద్దడంలాగా నా ఉత్తరంలో నా తప్పులను కాకుండా మీపై ఉండే అభిమానాన్ని గుర్తించవలసిందిగా ప్రార్థన. పెళ్ళయ్యాక మా వారితో బహుశా మద్రాసు వస్తాను. మిమ్మల్ని తప్పకుండా కలుసుకుని వస్తాను. మేమందరం క్షేమం. మీ క్షేమ సమాచారములు తెలుపవలెను. మీ అభిమాన పూర్వకమయిన ఆశీర్వచనములు ఎల్లప్పుడూ నా పైన ఉంటాయని ఆకాంక్షించే మీ పాత శిష్యురాలు.. గుడిపాటి విజయలక్ష్మి. జి.కె.రావు, బాల్కుమ్ విలేజ్, థాణా, వయా బాంబే, మహారాష్ట్ర.

ఈ ఉత్తరం చదువుతుంటే మా నాన్నగారిని, మా అమ్మనూ చూసినట్లనిపించింది. ఔను. ఉత్తరాలు రాసిన వారితో పాటు అందులోని వ్యక్తులూ కళ్ళముందు ప్రత్యక్షమవుతారు.

అన్నట్లు.. ఉత్తరం రాయాలని ఆశ. ఎవరికి రాయనూ? ఇంటి అడ్రెస్సులు తెలిస్తే ఒట్టు, మనుషుల ఫోన్ నెంబర్లు తప్ప. నిస్సారమైన కాలమిది అనిపిస్తుంటుంది ఉత్తరాల స్పర్శ లేకుండా.

– యామిజాల జగదీశ్

మన తెలుగు రాష్ట్రాలు కొన్ని వేల సంవత్సరాల నాగరికతకు ఆధ్యాత్మిక వికాసానికి నిలయాలుగా ప్రసిద్ధికెక్కాయి. మనవైన సంస్కృతి సంప్రదాయాలు మన జీవన ప్రగతికి మార్గదర్శకాలుగా నిలిచాయి. నడిపించాయి. నడిపిస్తున్నాయి. దీనికి పాలకులు కూడా తమ వంతు సహకారం అందించారు.

అనేక వంశాల రాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. అనేక ప్రజా ప్రయోజన పథకాలను ప్రవేశపెట్టారు. ప్రజలకు జాతి అభ్యున్నతికి నిర్మింపచేసారు అని శాసన ఆధారాలు తెలుపుతున్నాయి.

ప్రకాశం జిల్లా చీరలకు సమీపంలోని 'కనపర్తి' గ్రామంలో రెండవ శతాబ్ద కాలం నుండి పదిహేడవ శతాబ్ద కాలాల మధ్య తయారు చేసిన అనేక బౌద్ధ, జైన విగ్రహాల నుండి శివ, విష్ణు, దేవీ, నంది కంచు, పంచలోహ, రాతి విగ్రహాల వరకు తవ్వకాలలో లభించాయని తెలుస్తోంది.

గతంలో 'కనకపురిపట్నం'గా పిలవబడిన ఈ ఊరిలో లభించిన పాటు నిర్వహణకు నిధులు ఇచ్చారట మహారాణి.

కృష్ణానదీ తీరానికి వచ్చేనాటికి రుద్రమదేవి జన్మదినం వచ్చినదట. కాకతీయ సామ్రాజ్య పాలకురాలి పుట్టినరోజు ఆషామాషీగా జరిపించరు కదా! ఆమె బస చేసిన ప్రదేశానికి సమీపంలో ఉన్న పురాతన శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయాన్ని పునః నిర్మించాలని అనుకున్నారట.

ఈ ఆలయాన్ని పదవ శతాబ్ద కాలంలో ఈ ప్రాంతాన్ని పాలించిన చాళుక్య రాజులు నిర్మింపచేసినది

# కాకతీయ రుద్రమదేవి కొలిచిన రుద్రేశ్వరుడు

కారణమైన పురాణాల గురించి, అనుసరించవలసిన జీవన విధానం గురించి, సృష్టికి మూలమైన దేవీదేవతలు గురించి తెలియడానికి ప్రతి గ్రామంలోనూ ఆలయాల నిర్మాణం చేశారు. ఆలయాల నిర్వహణకు ధన, వస్తు, మాన్యాలను కైంకర్యాలుగా సమర్పించుకున్నారు.

ఈ కారణంగానే నేటికీ చిన్న చిన్న పల్లెల్లో కూడా చక్కని దేవాలయాలు తెలుగు రాష్ట్రాలలో నేటికీ కనిపిస్తున్నాయి.

ముఖ్యంగా శాతవాహనులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర పాలకులు, గజపతులు.. ఇలా ఎందరో రాజులు ఎన్నో దివ్యధామాలు నిర్మించారు. పల్లె ప్రజలకు కూడా పురాణ గాథల పట్ల, పురాణ పురుషుల పట్ల సరైన అవగాహన కలిగించడానికి కృషి చేసారు. చివరగా అమరావతిని రాజధానిగా చేసుకొని పాలించిన శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు విశేషకృషి చేసారని తెలుస్తోంది. ఆయన పాలనా కాలంలో అనేక పురాతన ఆలయాలను పునః నిర్మించడంతో పాటు ఎన్నో ప్రాంతాలలో నూతన ఆలయాలను



శిల్పాలను 'టంగుటూరి ప్రకాశం పంతులు సంగ్రహాలయం'గా ఏర్పాటు చేశారు.

కాకతీయ రాజులు ఏకఛత్రాధిపంగా తెలుగు నేలను ఏలుతున్న కాలంలో వారు కనపర్తిని గొప్ప శిల్పశాలగా అభివృద్ధి చేసారని చరిత్రకారుల అభిప్రాయం. ఇక్కడ నుండి తాము నిర్మిస్తున్న ప్రాంతానికి కావలసిన శిల్పాలను తరలించేవారట. తవ్వకాలలో వారి కాలం నాటి శిల్పాలు, శివలింగాలు నంది విగ్రహాలు బయల్పడటం దీనికి బలం చేకూరుస్తోంది.

తన పాలనా కాలంలో ఒకసారి ఈ శిల్పశాలను సందర్శించడానికి కాకతీయ రుద్రమ దేవి తరలి వచ్చారట. ప్రయాణ మార్గంలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేయడంతో అని తెలుస్తోంది. వారి పాలనా కాలంలో ఆలయాలు లేని గ్రామాలను ఎంచుకొని మరీ దేవాలయాలను నిర్మించినట్లు తెలుస్తోంది.

ఆలయాన్ని సుందరంగా నిర్మింప చేసిన రుద్రమదేవి ఆలయ నిర్వహణకు భూములు, గోవులు, ధనం ఇచ్చారని ప్రాంగణంలో కనిపించే శాసనం తెలుపుతుంది.

## శ్రీ రుద్రేశ్వరస్వామి ఆలయం

చాళుక్య రాజులు నిర్మించిన శ్రీ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయాన్ని రుద్రమదేవి పాలనా కాలంలో పునః నిర్మించడం వలన స్వామిని శ్రీ రుద్రేశ్వరుడు అని పిలుస్తున్నారు.

ప్రస్తుత ఆలయాన్ని గ్రామస్థులు కలిసికట్టుగా నిధులు సమకూర్చుకొని నిర్మించుకున్నారు.

తూర్పు ముఖంగా ఉండే ఆలయానికి ఎలాంటి రాజగోపురం ఉండదు. స్వాగత తోరణం మాత్రమే ఉంటుంది. తోరణం పైన మునికుమారుడైన మార్కండేయుని ప్రాణాలను తీయడానికి వచ్చిన యమధర్మరాజుని నిలుపుతున్న శ్రీ మహేశ్వరుని సుందర విగ్రహాలను అమర్చారు.

కాలుని నిలువరించిన రుద్రుడు కొలువైన క్షేత్రంగా ఈ సన్నివేశం ఉంచడం సమంజసంగా అనిపిస్తుంది. ద్వారానికి ఇరుపక్కలా శ్రీ గణపతి, శ్రీ గంగాధర జీవం ఉట్టిపడే విగ్రహాలను ఏర్పాటు చేశారు. విశాల ప్రాంగణంలోకి ప్రవేశించగానే ఎత్తైన ధ్వజస్థంభం కనిపిస్తుంది. ప్రదక్షిణా పథంలో పాత ఆలయంలోని నంది, శ్రీ వీరభద్రుడు మరికొన్ని శిథిల శిల్పాలు కనిపిస్తాయి. ఈ ఆలయం సర్పదోష, నాగప్రతిష్ఠలకు ప్రసిద్ధి గాంచింది. నవగ్రహ మండప సమీపంలో శ్రీ ఫణి రూప సుబ్రహ్మణ్య స్వామి సన్నిధి కనిపిస్తుంది. ఈ రెండు నిర్మాణాలు నూతనంగా ఏర్పాటు చేసారు.

## శ్రీ చెండికేశ్వర స్వామి సన్నిధి

తమిళనాడులోని అన్ని శివాలయాలలో గాయక భక్తులైన అరవై మూడు మంది నయనారుల సన్నిధి తప్పకుండా కనపడుతుంది. వివిధ కాలాలకు, సమాజంలోని వివిధ వర్ణాలకు చెందిన వీరు తమ అచంచల శివభక్తితో నయనారులుగా ప్రసిద్ధి చెందారు. వీరి జీవిత చరిత్రలను 'పెరియ పురాణం' అన్న గ్రంథంలో విపులంగా వివరించారు. నాయనారు అంటే 'శివ గణం' అని అర్థం చెప్పుకోవచ్చు. తమిళనాట అన్ని శివాలయాలలో తప్పనిసరిగా అభిషేక జలం వెలుపలికి ప్రవహించే గోముఖి వద్ద చెండికేశ్వరుడు దర్శనమిస్తారు. ఆయన అసలు పేరు విచారశర్మ. తన అచంచల శివభక్తితో అరవై మూడు మంది నయనారులలో ఒకరుగా సుస్థిర స్థానం పొందారు. శివాజ్ఞ మేరకు ఆలయాలలో గోముఖి వద్ద శ్రీ చెండికేశ్వర స్వామి నిరంతరం ధ్యానంలో ఉంటారు. ఆయన శివాలయాలకు వచ్చే భక్తుల వివరాలను నమోదు చేస్తారని చెబుతారు. అందుకే భక్తులు తప్పనిసరిగా ప్రదక్షిణ సమయంలో భక్తులు చప్పట్లు లేదా చిటికెలు వేసి ఆయన వద్ద తమ గోత్రనామాలు చెప్పుకొంటారు. అప్పుడే శివానుగ్రహం సంపూర్ణంగా



లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు.

ఈ మధ్య కాలంలో మన రాష్ట్రంలో కూడా అనేక శివాలయాలలో శ్రీ చెండికేశ్వర స్వామి సన్నిధి ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఈ ఆలయంలో కూడా శ్రీ చెండికేశ్వర స్వామి దర్శనమిస్తారు.

## ఆలయ విశేషాలు

ఆదిదంపతులు ఉపస్థిత భంగిమలో ఉన్న శిల్పాలు మధ్యలో, నలుమూలలా నందీశ్వరుడు ఉన్న ముఖమండపంలో శ్రీ నందీశ్వరుడు శివాజ్ఞ కొరకు ఉపస్థితులై ఉంటారు. ముఖమండపానికి అనుసంధానంగా మూడు సన్నిధులు కనిపిస్తాయి. దక్షిణం వైపున ఉన్న సన్నిధిలో విఘ్ననాయకుడు శ్రీ వినాయకుడు కొలువై ఉంటారు.

## వలంపురి వెత్రి వినాయక

ఈ తమిళ పేరుకి అర్థం విజయాన్ని ప్రసాదించే సిద్ధి వినాయకుడు. సహజంగా ఆలయాలలో శ్రీ గణపతి రూపాలలో తొండం ఎడమ పక్కకు తిరిగి ఉంటుంది. దానికి భిన్నంగా కుడి వైపుకి తిరిగి ఉన్న రూపంలో కొలువైతే 'వలంపురి వెత్రి వినాయకుడు' అని పిలుస్తారు.

ఈ రూపాన్ని ఆరాధించడం వలన మనలోని సూర్యనాడి ప్రభావితం అవుతుంది. ఈ స్వామి భక్తసులభుడు. అభీష్ట, జ్ఞాన, ధన, విజ్ఞాన ప్రదాత. అన్నింటా విజయాన్ని ప్రసాదించేవాడు. అపమృత్యు భయాన్ని తొలగించే వానిగా కూడా ప్రసిద్ధి. శ్రీ రుద్రేశ్వర స్వామి వారి ఆలయంలో కొలువైనది విజయాన్ని ప్రసాదించే సిద్ధి వినాయకుడు. ప్రతి నెల సంకట మోచన చతుర్థి పూజలు చేస్తారు. వినాయక చవితిని ఘనంగా నిర్వహిస్తారు.

## శ్రీ విశాలాక్షి అమ్మవారు

గర్భాలయానికి ఉత్తరం వైపున ఉన్న సన్నిధిలో అమ్మవారు శ్రీ విశాలాక్షి దేవి చతుర్భుజాలలో త్రిశూలం, ఢమరుకం, అభయ, వరద హస్తాలతో ఉపస్థిత భంగిమలో శాంతస్వరూపిణిగా దర్శనమిస్తారు. నిత్యం అమ్మవారి సమక్షంలో శ్రీచక్ర అర్చన జరుపుతారు. అమ్మవారిని సంతానప్రదాయనిగా విశ్వసిస్తారు. దసరా నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు.

## శ్రీ రుద్రేశ్వర స్వామి

ప్రధాన గర్భాలయంలో నలుచదరపు పానవట్టం మీద బ్రహ్మసూత్రం ధరించిన లింగ రూపంలో శ్రీ రుద్రేశ్వర స్వామి చందన, విభూతి లేపనాలతో పుష్ప అలంకరణలో నాగాభరణం ధరించి నయన మనోహరంగా దర్శనం ప్రసాదిస్తారు. కృష్ణా నదీతీరంలో ఉన్న గుంటూరు, కృష్ణా జిల్లాలలో ఉన్న అనేక బ్రహ్మ సూత్రం శివలింగాలు నెలకొని ఉన్న ఆలయాలలో శ్రీ రుద్రేశ్వర స్వామి కొలువైన వడ్డేశ్వరం ఆలయం ఒకటి.

నిత్యం ఉదయం ఆరు నుండి పదకొండు వరకు; తిరిగి సాయంత్రం అయిదు నుంచి రాత్రి ఎనిమిది వరకు తెరిచి ఉంటుంది.

**– ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

# 2 నవంబరు, 2025 నుండి 8 నవంబరు, 2025 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం కొన్ని కూరగాయలను పండించుకోవాలన్న ఇంట్లోనే పెంచుకోవాలి అన్న ఆలోచనలు ముడిబడతాయి. నూతన కార్యక్రమాలను ప్రారంభించగలుగుతారు. జీవిత ఆశయాన్ని లక్ష్యాన్ని సాధించడం ప్రస్తుతానికి అసాధ్యంగా మారుతుంది. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. అయినవాళ్లతో ఏకీభవించలేని పరిస్థితులు ఏర్పడతాయి. అయినప్పటికీ మీలో చలనం ఉండదు.

### వృషభం

ఈ వారం కొన్ని విషయాలు ఎన్నో రోజులుగా నేర్చుకోవాలని ఉబలాట పడుతున్న మీకు అవి ఇప్పుడు నేర్చుకో గలుగుతారు. మానసిక తృప్తి కలిగి ఉంటారు. క్రీడారంగంలో ఉన్న వారికి కాలం అనుకూలంగా ఉంది. పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు ఉపకరిస్తాయి. సర్వ రక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నానమాచరించండి. పెద్ద సంస్థలతో వ్యాపార ఒప్పందాలను కుదుర్చుకోగలుగుతారు.

### మిథునం

ఈ వారం మార్పులు ఏర్పడతాయి మన శత్రువర్గం ఎవరెవరు అన్న విషయాలను మనం గ్రహించగలుగుతాము సహోదర సహోదరీ వర్గంతో సమయస్ఫూర్తితో వాక్చాతుర్యాన్ని ప్రదర్శించి సమస్యలు తలెత్తకుండా ప్రయత్నిస్తారు మహా పాశుపత కంకణం ధరించండి ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. జీవిత భాగస్వామి సలహాలు సూచనలు మేరకు కొన్ని నూతన కార్యక్రమాలను ప్రారంభించగలుగుతారు.

### కర్కాటకం

ఈ వారం పెద్దవాళ్ల పర్యవేక్షణలో కొన్ని నూతన వ్యవహారాలను ప్రారంభిస్తారు. వివాహ సంబంధిత విషయాలు అనుకూలిస్తాయి. సహోదర సహోదరీ వర్గంతో విభేదాలు ఏర్పడకుండా తగు జాగ్రత్తలు అవసరం. ఓం నమో నారాయణ ఒత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. నూతన కార్యక్రమాలను ప్రారంభించాలన్న ఉత్సాహం ఉండదు. పెట్టిన పెట్టుబడులు రెట్టింపుపై వస్తాయి.

### సింహం

ఈ వారం కుటుంబంలో ఐకమత్యం లోపించడం. ప్రతి ఒక్కరికి మీరు సంపాదించే సంపాదన మాత్రమే కనిపించడం. వాళ్ళ అవసరాలు తీర్చలేక పోతే మీతో గొడవలు ఏర్పడటం. ఈ రకమైన వాతావరణం ఏర్పడుతుంది. సొంత నిర్ణయాలలో చిన్న చిన్న తప్పులు దొర్లడం ప్రతి ఒక్కరితో మాటలు పడటానికి కారణమవుతుంది. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది.

### కన్య

ఈ వారం నూతన వస్తువులు వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గాని రాజకీయాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. కొన్ని పదవుల కోసం ప్రయత్నం చేయాలని భావిస్తారు. కొత్తగా పరిచయమైన వ్యక్తులకు ఇట్టి విషయాలను తెలియనివ్వవద్దు.

### తుల

ఈ వారం వ్యాపార ప్రదేశాల్లో కొంతమందిని గుడ్డిగా నమ్మి మోసపోతారు ఇలాంటి వాటికి తావు ఇవ్వవద్దు. జీవిత భాగస్వామితో సఖ్యత కలిగి ఉంటారు. అష్టమూలిక తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి. సుదీర్ఘమైన సంభాషణలు జరిపి సంతానం నిమిత్తమై మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతారు. నూతన వస్తువులు వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటారు.

### వృశ్చికం

ఈ వారం జీవిత భాగస్వామి సలహాలు సూచనలతో నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు, కుటుంబ శ్రేయస్సు కోరి కొన్ని పథకాలలో కొంచెం కొంచెం ధనాన్ని దాస్తారు. గురువులు, కొత్త కళాశాలలోని వ్యక్తులతో మనస్పర్థలు ఏర్పడవచ్చు. తగు జాగ్రత్తలు అవసరం. తల్లి గారితో మాట్లాడేటప్పుడు ఓర్పు వహించండి. అనవసరమైన కోపతాపాలకు గురి అవ్వద్దు. అష్టమూలిక తైలంతో లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి.

### ధనస్సు

ఈ వారం ఆర్థిక సంబంధ వ్యవహారాలలో లోటుపాట్లు తప్పక పోవచ్చు. విపరీతమైన పని ఒత్తిడి మీ ఆరోగ్యాన్ని చెడగొట్టవచ్చు. అకారణముగా ఒక మిత్రుడితో విరోధం రాకుండా ముందు జాగ్రత్త వహించండి. దైవానుగ్రహం అన్ని వేళలా అండగా ఉంటుంది. అష్టమూలిక తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి. ధైర్యంతో తీసుకున్న ఒక నిర్ణయం సరికొత్త మలుపుకు దారి తీస్తుంది. కనిపించని కృతజ్ఞత కొరకు ఎదురు చూసి నిరాశ పడతారు.

### మకరం

ఈ వారం భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. వివాహాది శుభకార్యాలు సానుకూల పడతాయి. కీలకమని భావించిన విషయాలలో తొందరపాటు తగదు, జాగ్రత్త వహించండి. జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఆటంకాలన్నీ తొలగిపోతాయి. కళ్ళకు చక్రాలు కట్టుకొని మరి పనిచేస్తారు. ప్రయోజనాలు మన పిల్లలకి దక్కాలి అని భావిస్తారు, శుభవార్త వింటారు.


### కుంభం


ఈ వారం ఈ వారం సాంకేతిక విద్యలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురు కాగలవు. వాహనం, స్థలాలు కొనుగోలు యత్నాలు ఫలించవు. దూరపు బంధువుల నుంచి అందిన సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి ఉంటారు వాళ్లకు విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది.

### మీనం

ఈ వారం మీ శ్రమకు మీ కష్టానికి ప్రతిఫలాలను అందుకోగలుగుతారు. రాజకీయ పైరవీలు లాభిస్తాయి. వాక్చాతుర్యంతో ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లో నుండైనా బయటపడ గలుగుతారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. మేనేజ్‌మెంట్‌లో ఉన్న వారికి కాలం అనుకూలంగా ఉంది. జీవిత భాగస్వామితో మాట్లేడపుడు సంయమనం పాటించండి. ఒత్తిడి కలిగిన బాధ్యతలను సైతం చక్కగా చెయ్యగలరు.

# ఈ వారం కార్టూన్స్


ఎంతో కష్టమైనదే అయినా ఇంతవరకు ఏ అభ్యర్థీ ఇవ్వని హామీ నేను ఇస్తున్నాను.. నేను మీకు అందుబాటు లో ఉంటాను, రోడ్లు, బడులు, ఆసుపత్రుల అభివృద్ధి, యువతకు ఉపాధి ,స్కిల్ డెవలప్మెంట్ ల కోసం కృషి చేస్తాను...


చెప్పడానికి శీలవ్రతమున్నది.. దానికి ప్రల్లప్రల్లగా, తియ్య తియ్యగా ఏదైనా తినాలనుందట..!!


పై బీపీ 167, కిందది 82 నా? అంటే తలకు, కాళ్లకు బీపీ వేరు వేరుగా ఉంటుందా డాక్టర్?!
డా|| ఫిజీషియన్.
RMP





క్రొయేషియాలోని ఇస్ట్రియా ప్రాంతంలో ఉన్న
హమ్ పట్టణానికి సంబంధించిన చిత్రాలివి.
ప్రపంచంలో అతి చిన్న పట్టణంగా పేరు గాంచింది.



